తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక వార్త

## కర్నూలు రేంజ్‌లో భారీగా సిఐలకు పదోన్నతులు



తిరుపతి,డిసెంబర్ 31(ప్రభాతవార్త):
పోలీసుశాఖలో ఈ యేడాది ఆఖరులో నూతన ఆంగ్ల సంవత్సరం కానుకగా సీనియార్టీ ప్రాతిపదికన భారీగా సిఐలకు డిఎస్పీలుగా పదోన్నతి కల్పిస్తూ ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా పలు రేంజ్‌లలో పనిచేస్తున్న సీనియర్ సిఐలు 155మంది ఈ పదోన్నతులు జాబితాలో ఉన్నారు. ఇందులో కర్నూలు రేంజ్ పరి ధిలో కర్నూలు, కడప,తిరుపతి, చిత్తూరు, అనంతపురం, సత్య సాయి, అన్నమయ్య జిల్లాల్లో వివిధ సర్కిళ్ళలో పనిచేస్తున్న 36మందివరకు సిఐలు డిఎస్పీలుగా అర్హత పొందినట్లు పోలీసుశాఖ డిజిపి కార్యాలయం నుండి ఉత్తర్వులు వెలువడ్డాయి. కర్నూలు రేంజ్ పరిధిలో సిహెచ్.అంజూయాదవ్, కె.శరత్‌చంద్ర, ఎం.శివప్రసాద్, ఎస్.చంద్రశేఖర్, ఎం. చంద్రశేఖర్, నాగరాజు, శ్రీరాముడు, భాస్కర్‌గౌడ్, కె. సాయినాథ్, భాస్కర్‌రెడ్డి, బి.గుణశేఖరబాబు, అషార్‌బాషా, ,చలపతిరావు, మురళీ, పి.సత్య బాబు ఇంకా పలువురు సిఐలు డిఎస్పీల పదోన్నతి జాబితాలో ఉన్నారు. వీరందరికీ రానున్న నూతన సంవత్సరం మార్చి,ఏప్రిల్‌నెలల్లోపు డిఎస్పీలుగా పోస్టింగ్‌లు ఇవ్వనున్నారు.

## జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా...
## వార్త దినపత్రిక 2025 క్యాలెండర్ ఆవిష్కరణ



జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్
వార్త జాతీయ తెలుగు దినపత్రిక 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

తిరుపతి కలెక్టరేట్,డిసెంబరు 31 ప్రభాతవార్త ః
తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ చేతులు మీదుగా మంగళవారం కలెక్టరేట్‌లో వార్త జాతీయ తెలుగు దినపత్రిక 2025 నూతన క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఆవిష్కరణ అనంతరం కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ముందుగా వార్త జాతీయ తెలుగు దినపత్రిక యాజమాన్యానికి, సిబ్బందికి 2025 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్‌ను వార్త సిబ్బంది శాలువ, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించి అభినందించారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వార్తా జాతీయ తెలుగు దినపత్రిక కొత్త ఏడాది క్యాలెండర్‌ను తన చేతుల మీదుగా ఆవిష్కరించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.ముఖ్యంగా ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు, డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ నేతృత్వంలో ఏపీ అంచలంచెలుగా ఎదుగుతోందని, అదే స్థాయిలో తిరుపతి జిల్లా అభివృద్ధి చెందుతున్న విషయాన్ని గుర్తు చేశారు.వార్త రిపోర్టర్లు మంచి కథనాలతో జిల్లా ప్రజలకు చేరువై తిరుపతి జిల్లా అభివృద్ధికి సహకరించగలరని కోరారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా లైజన్ అధికారి, జిల్లా సమా చార పౌరసంబంధాల శాఖాధికారి బాలకొండయ్య, వార్త హెల్త్ రిపోర్టర్ జయశంకర్, కలెక్టరేట్ రిపోర్టర్ పరంధామరెడ్డి,ఎడ్యుకేషన్ రిపోర్టర్ వెంకయ్య పాల్గొన్నారు.

# తహసీల్దార్ల రౌడీయిజం..!

## అర్ధరాత్రి వీధి రౌడీలలా రియల్‌టర్‌పై రెచ్చిపోయిన తహసీల్దార్‌లు..!
## రక్త గాయాలతో ఆసుపత్రిపాలైన రియల్‌టర్







నడిరోడ్డుపై తహసీల్దార్‌లు రియల్‌టర్‌ను చితకబాదుతున్న దృశ్యం, ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రియల్‌టర్ క్రిష్టకుమార్ రియల్‌టర్‌పై దాడి చేసిన తహసీల్దార్లు (ఫైల్ ఫోటో)

గంగవరం ,డిసెంబర్ 31,ప్రభాతవార్త:
చిత్తూరు నగర నడిఒడ్డున ఇద్దరు తహసీల్దార్‌లు తమ బాధ్యతలను మరచి బజారు గూండాలా బరితెగించి ఓ రియల్‌టర్‌పై దాడి చేసిన సంఘటన సోమవారం రాత్రి చిత్తూరులో చోటు చేసుకుంది.ఆది నుండి ఆ తహసీల్దార్‌ల తీరే వేరు.పలమనేరు నియోజకవర్గం గంగవరం తహసీల్దార్ శివకుమార్,పెద్దపంజాణి మండలం తహసీల్దార్ ప్రసన్నకుమార్‌ల వ్యవహార శైలి ఆది నుండి వివాదాస్పదమే.ప్రసన్నకుమార్ గతంలో గంగవరం రీ సర్వే డీటిగా విధులు నిర్వహిస్తూ ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా కొంత కాలం పనిచేశారు.ప్రస్తుతం గంగవరంలో పని చేస్తున్న శివకుమార్ గతంలో పని చేసిన ప్రసన్న కుమార్‌కు అత్యంత ఆప్తమిత్రుడు కావడంతో ఇరువురు ఒక జెట్టుగా ఏర్పడి గంగవరం మండలంలో వారు చెప్పిందే శాశనంగా వ్యవహరించే వారని విమర్శలు లేకపోలేదు. గతంలో జగనన్న రీ సర్వే ద్వారా హోల్డ్‌లో ఉన్న సర్వే నెంబర్లను సవరించాలంటే కూడా ప్రతి సచివాలయ పరిధిలో ఇంత మొత్తంలో ముట్టచెప్పితే తప్ప మీ ఫైల్ కదిలే పరిస్థితి లేదంటూ అల్టిమేట్ కూడా జారీ చేశారు.తాము నిర్దేశించిన సొమ్మును ఇస్తే మీరు క్రయ,విక్రయాలు చేపట్టవచ్చని లేకుంటే ఆ స్థలాలో సూచిక బోర్డులు ఏర్పాటు చేసి వ్యాపారాలు లేకుండా చేస్తామని బెదిరించడం వీరి నైజం. ప్రసన్నకుమార్ రీ సర్వేలో చేసిన పలు అవినీతి అక్రమాలను వెలుగులోని రాకుండా ఆయన ఆప్తమిత్రుడు ప్రస్తుత తహసీల్దార్ శివకుమార్ కప్పిపుచ్చుకుంటూ గుట్టుచప్పుడు కాకుండా వ్యవహరించేవారని తెలుస్తుంది.మామడుగు పంచాయితీలో రీ సర్వేలో దాదాపు 100మందికి పైగా రైతుల భూముల రికార్డుల తారుమారే ఇందుకు నిదర్శనం.తనకు అనుకూలంగా కార్యాలయంలో అవినితి పనులు చేయడానికి ఒకరిద్దరు విఆర్‌ఓలను ఆయన వెంట పెట్టుకుని ఎడ్యుకేషన్ ల్యాండ్‌లు,లీగల్ సమస్యలు,కుటుంబాల మద్య ఆస్థి తగాదాలు, గ్రామాలలో దారి సమస్యలు వంటి ఫిర్యాదులకు ఆ విఆర్‌ఓలను పంపి సెటిల్‌మెంట్‌లు చేసుకోవడంతో పాటు ఏవరి రికార్డులైనా ఆ విఆర్‌ఓల ద్వారా రాత్రికి రాత్రే తారుమారు చేసిన ఆరోపణలు కోకొళ్లలు.పగలు కార్యాలయాలలో కానరాని అధికారులు సాయంత్రం సమయాలకు కార్యాలయం చేరుకుని రాత్రంతా తన విఆర్‌ఓలతో అవినీతి అక్రమాలకు పాల్పడుతునట్లు విమర్శలు వెలువెత్తుతున్నాయి.ఈ నేపథ్యంలోనే చిత్తూరుకు చెందిన క్రిష్ణకుమార్ అనే రియల్ ఏస్టేట్ వ్యాపారి గంగవరం సమీపంలో సుమారు 6 ఎకరాల విస్తీర్ణంలో భూమిని కొనుగోలు చేసి లే అవుట్‌ను నూతనంగా నిర్మించే క్రమంలో తమ లే అవుట్‌లో వచ్చిన భూసమస్యను పరిష్కరించాలని గత కొంత కాలంగా వీరి చుట్టూ చక్కర్లు కొట్టారు.వీరు ఎంతకూ స్పందించకపోవడంతో చివరకు వారితో ఒప్పందం కుదుర్చుకున్నారు.అయితే రియల్‌ఏస్టేట్ వ్యాపారం ఒక్కసారిగా కుప్పకూలిపోవడంతో ఆ రియల్‌టర్ తహసీల్దార్‌లకు ఇచ్చిన మాట ప్రకారం సకాలంలో నగదు ఇవ్వలేకపోయాడు.ఈ క్రమంలో సోమవారం చిత్తూరు నగరంలోని ఓ బార్‌లో తహసీల్దార్‌లకు రియల్‌టర్ కనబడడంతో అప్పటికే మద్యం మత్తులో ఉన్న తహసీల్దార్‌లు ఆ రియల్‌టర్‌ను చూడగా ఆగ్రహంతో ఆ రియల్‌టర్‌ను నానాదుర్భాషలాడుతూ విచక్షణ రహితంగా చితకబాదారని బాధితుడు క్రిష్ణకుమార్ పేర్కొన్నారు.వారి దాడిలో తీవ్రంగా గాయపడ్డ క్రిష్ణకుమార్‌ను స్థానికులు చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు.మండల మెజిస్ట్రేట్‌లుగా వ్యవహరించాల్సి న తహసీల్దార్‌లు పూటుగా మద్యం సేవించి నడిరోడ్డుపై వీరంగా చేస్తు వీధి గూండాలా ప్రవర్ధించడంపై ప్రజలు,ప్రతి పక్షాలు తీవ్ర ఆక్రహం వ్యక్తం చేస్తున్నాయి.ఇలాంటి ఘటనలు పునారావృతం కాకుండా రాష్ట్ర స్థాయి అధికారులు,నాయకులు కఠిన చర్యలు తీసుకోవలసిన అవసరం ఎంతైన ఉంది.

### కన్నెర్ర చేసిన కలెక్టర్..తహసీల్దార్‌లపై వేటు

ఇద్దరు తహసీల్దార్‌లు మద్యం మత్తులో నడిరోడ్డుపై ఓ రియల్‌టర్‌పై దాడి చేసి గాయపరచిన ఘటనతో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆ తహసీల్దార్‌ల కన్నెర్ర చేసి వారిపై సస్పెన్షన్ వేటు వేశారు.సంఘటన జరిగిన కొద్ది గంటలలోనే ఇద్దరు తహసీల్దార్‌లపై కన్నెర్ర చేయడంతో జిల్లాలోని అధికార యంత్రాంగం ఉలిక్కిపడింది.పలమనేరు నియోజకవర్గంలోని గంగవరం,పెద్దపంజాణి తహసీల్దార్‌లు శివకుమార్,ప్రసన్నకుమార్‌ల పనితీరుపై,ప్రజల పట్ల వారి వ్యవహార శైలి వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు పలు ఫిర్యాదులు గతంలో జిల్లా కలెక్టర్ దృష్టికి వెళ్లినట్లు సమాచారం.ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ వారిపై వేటు వేయడం జరిగింది.

## వైకుంఠద్వార దర్శనాలకు భక్తులు భారీగా తరలివస్తారని అంచనా!

### -సామాన్యభక్తులకు సకల సౌకర్యాలు



ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:
పవిత్రమైన వైకుంఠ ఏకాదశి నేపథ్యంలో తిరుమలలో పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలకు టిటిడి అన్ని ఏర్పాట్లు చేపడుతోంది. ఇప్పటికే ఆలయంతో బాటు తిరుమలకొండంతా విద్యుద్దీపాలతో ,రకరకాల రంగవల్లులు, జర్మన్‌షెడ్లు, బారీకేడ్లు, భద్రత, క్యూలైన్లు ఏర్పాట్లు చేశారు. ఆన్‌లైన్‌లో దర్శన టిక్కెట్లువిడుదల చేసేశారు. ఆఫ్‌లైన్‌లో సామాన్యభక్తులకు వీలుగా తిరుపతిలోని 9చోట్ల టోకెను జారీచేయనున్నారు. ఇందుకోసం తిరుపతిలో, తిరుమలలో టిటిడి అధికారులు షెడ్లు, క్యూలైన్లు నిర్మించారు. పదిరోజులు ఆలయంలో దర్శన టిక్కెట్లు పొందిన భక్తులకు మహాలఘు(జయవిజయులవరకే)దర్శనం మాత్రమే ఉంటుంది.

## కాణిపాకంలో నూతన సంవత్సరాది ఏర్పాట్లు పూర్తి

### -వేకువ జామున 4 గంటల నుండే సర్వదర్శనం ప్రారంభం

### -ఈఓ పెంచల కిషోర్



కాణిపాకం, డిసెంబర్ 31 ప్రభాతవార్త:
నూతన సంవత్సరాది సందర్భంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టి పూర్తి చేసినట్లు ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. నూతన సంవత్సరాది రోజున స్వామివారి దర్శనార్థం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చే ఆవకాశమున్నందున దేవస్థానం వద్ద ఎటువంటి అసౌకర్యం కలుగకుండా కావలసిన ఏర్పాట్లు చేపట్టి పూర్తి చేసినట్లు తెలిపారు. భక్తులకు త్వరితగతిన స్వామి దర్శనం కల్పించేందుకు ఉచిత దర్శనంతో పాటు 100 శీఘ్రదర్శనం, 150 అతి శీఘ్రదర్శనం భక్తులకు వేర్వేరుగా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆలయంలో జనవరి 1న అర్ధరాత్రి 12 గంటలకు స్వామివారికి ప్రత్యేక అభిషేకం, చందనాలంకారం అనంతరం తెల్లవారుజామున 4 గంటల నుండి సర్వదర్శనం ప్రారంభమై రాత్రి 10 గంటల వరకు కొనసాతుందని ఈఓ తెలిపారు. అన్ని రకాల ఆర్జిత సేవలను రద్దు చేస్తున్నట్లు ఈఓ పెంచల కిషోర్ తెలిపారు. కావున ఆలయ ఉభయదారులు, భక్తులు, స్థానికులు సహకరించాలని కోరారు. ఆలయం వద్ద నూతన సంవత్సరాది రోజున విఘ్ననాథుని భక్తులు సంతృప్తికంగా దర్శించుకోవాలని ఆయన కోరారు.

## మిరపకాయల బస్తాలతో వస్తూ మృత్యులోకాలకు



వి.కోట, డిసెంబర్ 31ప్రభాతవార్త
మిరపకాయలను విక్రయించేందుకు తన టువీలర్‌లో మిరపకాయల బస్తాలతో వస్తున్న ఓ వ్యక్తి వాహనం అదుపు తప్పిబోల్తా పడడంతో మృత్యువాత పడ్డాడు. ఈసంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా.. కర్ణాటక రాష్ట్రం చించాండ్లపల్లికి చెందిన సంజీవనాయుడు అనే వ్యక్తి మిరపకాయలు రెండు బస్తాలను టువీలర్‌లో వి.కోట మార్కెట్‌కు తీసుకువస్తూ మార్గమధ్యంలో అన్నవరం క్రాస్ వద్ద అతని టువీలర్ అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో గాయాలపాలైన సంజీవనాయుడు మృతి చెందాడు.

# అన్నదాత కళ్ళల్లో ఆనందమే లక్ష్యంగా పథకాలు

### ఖాళీ ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చర్యలు
### అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ళు
### భవిష్యత్తులో వ్యవసాయానికి 9 గంటలు సౌర విద్యుత్
### ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం దిశగా చర్యలు
### జడ్పీ సర్వసభ్య సమావేశంలో ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు




చిత్తూరు, డిసెంబర్ 31 ప్రభాతవార్త:
అన్నదాత కళ్ళల్లో ఆనందం చూడటమే లక్ష్యంగా రాష్ట్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం పలు పథకాల అమలుకు శ్రీకారం చుట్టనుందని ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు అన్నారు. జడ్పీ సమావేశభవనంలో మంగళవారం జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు అధ్యక్షతన జడ్పీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, తిరుపతి ఎంపీ డాక్టర్ ఎం.గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్‌నాయుడు, డాక్టర్ కలికిరి మురళీమోహన్, పెద్దిరెడ్డి ద్వారకనాధరెడ్డిలు హాజరయ్యారు. ఈ సమావేశంలో ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు మాట్లాడుతూ వ్యవసాయంను లాభాల బాటలో నడిపించడానికి ప్రభుత్వం పలు చర్యలకు శ్రీకారం చుట్టిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు, ఆట స్థలాలు, సొంత భవనాలు వున్నాయని, ఖాళీ ఉపాధ్యాయులను భర్తీ చేయడానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దడానికి ప్రభుత్వం కంకణం కట్టుకుని ముందుకు సాగుతుందన్నారు. తిరుపతి ఎంపీ డాక్టర్ ఎం.గురుమూర్తి మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో మండల స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి నిధుల వినియోగంపై అధికారులు ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుని ముందుకు వెళ్ళాలన్నారు. జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు మాట్లాడుతూ మండల స్థాయిలో మండల సర్వసభ్య సమావేశాలు ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించేలా ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో మండలాలను అభివృద్ధి దిశగా తీసుకెళ్ళడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లా జడ్పీ సర్వసభ్య సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలపై సంబంధిత జిల్లా కలెక్టర్లకు సమాచారం అందించి తీసుకున్న చర్యలపై తదుపరి సమావేశంలో చర్చించేలా కృషి చేస్తామన్నారు. వివిధ పాఠశాలల్లో అసంపూర్ణంగా వున్న పనులను త్వరితంగా పూర్తి చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని, అసంపూర్తిగా వున్న అంగన్‌వాడీ భవన నిర్మాణాలను పూర్తికి ఉపాధి నిధులు ఖర్చుపై ప్రభుత్వంను అనుమతి కోరడం జరిగిందన్నారు. జి ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ ప్రైవేటు ఆసుపత్రుల్లో ఎన్‌టిఆర్ వైద్య సేవలో భాగంగా చికిత్స పొందుతున్న వారికి సంబంధించి పెండింగ్‌లో వున్న నిధులను త్వరితంగా మంజూరు చేసేలా చొరవ చూపాలన్నారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ముందంజలో వుందన్నారు. చిత్తూరు పూనేపల్లి వద్ద అసంపూర్తిగా వున్న టిడ్కో ఇళ్ళను పూర్తి చేయడానికి చొరవ చూపాలని కోరారు. పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని, మండలాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంలో గ్రామసభలు నిర్వహించి ప్రజల అభిప్రాయం మేరకు అభివృద్ధి కార్యక్రమాల తీర్మానాలు చేసుకోవాలన్నారు. తంబళ్ళపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాధరెడ్డి మాట్లాడుతూ తన నియోజకవర్గంలో మండల స్థాయి సమావేశాలు నిర్వహించాలని, ప్రజాప్రతినిధులకు ముందస్తు సమాచారం ఇవ్వాలని కోరారు. సమావేశం ప్రారంభంలో దివంగత మాజీ ప్రధాని మనోహ్మాన్ సింగ్ మృతికి రెండు నిముషాల పాటు సభ్యులు మౌనం పాటించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు, అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, తిరుపతి డిఆర్‌ఓ నరసింహులు, జడ్పీ సిఇఓ రవికుమార్‌నాయుడు, వివిధ శాఖల అధికారులు, జడ్పీటిసీలు, ఎంపిపిలు, జడ్పీ కో-అప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రక్షాళన దిశగా పాలకమండలి అడుగులు !

### -మంచి కార్యక్రమాలకు మీరే న్యాయనిర్ణేతలు -టిటిడి ఛైర్మన్‌కు సిఎం చంద్రబాబు అల్టిమేటమ్



తిరుమల,డిసెంబర్ 31ప్రభాతవార్తప్రతినిధి:
గత వైసిపి ప్రభుత్వ హయాంలోని గత టిటిడి పాలకమండళ్ళు తీసుకున్న కొన్ని నిర్ణయాలపై,అనవసర వ్యయంపై లోతుగా చర్చించి, తప్పులు సరిదిద్దేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడుకు సూచించడం ఇప్పుడు టిటిడిలో హాట్‌టాఫిక్‌గా మారింది. తిరుమలలో పూర్తిప్రక్షాళన దిశగా ప్రస్తుత పాలకమండలి అడుగులు వేయాలని, పాలకమండలి నిర్ణయంమేరకు ఏ అంశంపై అయినా అధ్యయనం చేసి సానుకూల నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుందని స్పష్టతనిచ్చారు. స్వయంగా సిఎం చంద్రబాబు పాలకమండలికి మరింత ప్రాధాన్యత నివ్వడంతో ఇప్పుడు టిటిడిలో, తిరుమలలో మరింతగా ప్రక్షాళన చేసి ఉద్యోగులు, అధికారులు బాధ్యతాయుతంగా పనిచేసేలా చూడటంలో ఛైర్మన్ బిఆర్‌నాయుడు కార్యాచరణ రూపొందించనున్నారు.ఇప్పటికే తిరుమల ఆలయంలో దేవుని దర్శనం కోసం వచ్చే భక్తులు తోపులాటకు గురవుతున్నారని, భక్తుల పట్ల సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తున్నారనే ఫిర్యాదులపై స్పందించిన ఛైర్మన్ ఉద్యోగులకు నేమ్‌బ్యాడ్జి పెట్టాలని,దీనివల్ల ఎవరైనా తప్పులుచేసినా, భక్తులపట్ల అనుచితంగా ప్రవర్తించినా చర్యలు తీసుకునేందుకు వీలవుతుందని డిసెంబర్ 24వతేదీ తిరుమలలో జరిగిన పాలకమండలి నిర్ణయాన్ని అధికారులు విముఖత చూపడంపై సిఎం దృష్టికి వెళ్ళింది. దీనిపై స్పందించిన సిఎం పాలకమండలి నిర్ణయం మేరకు ముందుకు వెళ్ళండని నిర్దేశించారు. స్విమ్స్ ఆస్పత్రిలో అదనపు నూతన భవనాల నిర్మాణాలు, చిన్నపిల్లల ఆస్పత్రి భవనాల నిర్మాణాలపై కూడా పాలకమండలి తీసుకోనున్న చర్యలు గురించి ఆరా తీశారు. నూతన భవనాల నిర్మాణాలను ఆపేందుకు పాలకమండలి నిర్ణయం తీసుకోనుందని సమాచారం . అన్యమతస్తుల విషయంపై. గత ప్రభుత్వ హయాంలో డిప్యూటేషన్‌పై వచ్చిన ఎనిమిదిమంది అధికారులను బదిలీ చేయాలని సిఎంకు విన్నవించడంతో ఛైర్మన్‌కు ఆ అనుమతులివ్వడంతో వారంతా మాతృశాఖకు పంపడం టిటిడి అధికారులకు తప్పదు. మంచి నిర్ణయాలు తీసుకుంటే పాలకమండలి నిర్ణయాలే ఫైనల్ అని సిఎం ఛైర్మన్ నాయుడుకు చెప్పడంతో ఇక రానున్న రోజుల్లో తిరుమలపై పాలకమండలి మరింత దృష్టి పెట్టే అవకాశం కనిపిస్తోంది. హిందూ ధర్మాన్ని విశ్వవ్యాప్తి చేయడానికి, భక్తులకు సౌకర్యాలు కల్పన, మరింత త్వరగా సంతృప్తికరంగా ఏడుకొండలస్వామి దర్శనం చేయించడంలో ఆధునిక సాంకేతిక వ్యవస్థ అమలుకు మీరు తీసుకున్న మంచి ఆలోచనలను అమలుచేయాలని సిఎం సూచించడం శుభపరిణామమే.

## విజయమే లక్ష్యంగా విద్యార్థులు శ్రమించాలి

### ఒడిశా స్పీకర్ డాక్టర్ సుమరపాడి

తిరుపతి విద్య డిసెంబర్ 31 ప్రభాత వార్త:
విద్యార్థులు విజయమే లక్ష్యంగా అహర్నిశలు శ్రమించాలని ఒడిశా రాష్ట్ర స్పీకర్ డాక్టర్ సుమరపాడి పిలుపునిచ్చారు. మంగళవారం జాతీయ సంస్కృత వర్సిటీలో జరిగిన సౌత్ జోన్ సంస్కృత విద్యార్థుల క్రీడా మహోత్సవ ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేశారు.ఆమె మాట్లాడుతూ క్రీడలు దేశ వికాసానికి ప్రతీకలని, సంస్కృత వర్సిటీలకు చెందిన విద్యార్థులు క్రీడాలలో రాణించడం అభినందనీయమన్నారు. దేవభాష సంస్కృత అభివృద్ధికి వర్సిటీ కృషి చేయడం గర్వంగా ఉందన్నారు.సంస్కృత భాష భారతీయతకు ప్రతికగా నిలిచిందని,ఏఐ, అధునాత కోడింగ్ టెక్నాలజీతో భాష కొత్తపుంతలు తొక్కడం స్వాగతించే అంశమన్నారు.విద్యార్థులు జీవిత లక్ష్యాన్ని నిర్దేశించుకుని సాధనవైపు బలమైన అడుగులు పడాలని ఆకాంక్షించారు. వర్సిటీలో సంస్కృత క్రీడా మీట్ ఘనంగా నిర్వహించిన అధికారులను ఆమె అభినందించారు.జాతీయ సంస్కృత క్రీడా పోటీలలో వర్సిటీ 15 గోల్డ్ మెడల్స్, 3 సిల్వర్ మెడల్స్ తో చాంఫియన్ గా నిలవడం గర్వకారణమని వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి తెలిపారు.అనంతరం అతిథుల చేతుల మీదుగా వివిధ క్రీడల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు గోల్డ్,సిల్వర్,బ్రౌంజ్ మెడల్స్ అందజేశారు.ఈ కార్యక్రమంలో శ్యాప్ ఛైర్మన్ రవినాయుడు, రిజిస్ట్రార్.రమాశ్రీ, అకడమిక్ డీన్లు రజనీకాంత శుక్ల,ఎస్ దక్షిణమూర్తి శర్మ, క్రీడాసమితి అధ్యక్షులు సతీష్,పీడీ సేతూరామ్,సి రంగనాథన్,అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## అక్రిడేషన్ కార్డుల గడువు రెండు నెలలు పెంపు
**– కలెక్టర్ సుమిత్‌కుమార్**

**చిత్తూరు, డిసెంబర్ 31 ప్రభాతవార్త:**
జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు మంగళవారంతో ముగుస్తుండటంతో అక్రిడిటేషన్ల కాలపరిమితిని రెండు నెలల పాటు పొడగిస్తూ సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు హిమాన్షు శుక్లా ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు 1 జనవరి 2025 నుండి 28 ఫిబ్రవరి 2025 వరకు లేదా కొత్త అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియ చేయడం కానీ ఏది ముందు జరిగితే అప్పటి వరకు ఈ ఉత్తర్వులు అమలులో వుంటాయని కలెక్టర్ తెలిపారు.

## సాంకేతిక అభివృద్ధిలో ఖ్యాతి గడించాలి
**తొట్టంబేడు, డిసెంబర్ 31 ప్రభాతవార్త**



విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి పరచుకోవాలని జిల్లా సైన్సు అధికారి భాను ప్రసాద్ అన్నారు. పట్టణంలోని ఆర్‌పిబిఎస్ జిల్లా పరిషత్ ఉన్నత బాలుర ఉన్నత పాఠశాలలో మండలస్థాయి సైన్సు ఫేర్ ఎగ్జిబిషన్ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా సైన్సు అధికారి భాను ప్రసాద్ విచ్చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అంశాన్ని కూలంకషంగా తెలుసుకుంటూ అందులో నూతన ఒరవడిని సాధించేందుకు విద్యార్థులు ప్రయత్నించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు భువనేశ్వరి, బాలయ్య, ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి, ఉపాధ్యాయులు, సిఆర్పీలు పాల్గొన్నారు.

## పదవీవిరమణ ఉద్యోగాల్లో సర్వసాధారణం
**.తొట్టంబేడు, డిసెంబర్ 31 ప్రభాతవార్త**




ఉద్యోగం ఏదైనా సమయం వచ్చినపుడు పదవీ విరమణ చేయాలని ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, తహశీల్దార్ లక్ష్మినారాయణలు తెలిపారు. వృత్తినే దైవంగా భావించి విధి నిర్వహణలో అందరి మన్ననలు పొంది ఇటు తొట్టంబేడు, అటు శ్రీకాళహస్తి తహశీల్దార్ కార్యాలయాలో విధులు నిర్వహించి ఆర్డీవో కార్యాలయ ంలో పనిచేస్తున్న యస్.ముంతాజ్‌బేగం పదవీ పనిచేస్తూ పదవీ విరమణ చేశారు.ఈసందర్భంగా ఆర్డీవో భాను ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ వృత్తిరీత్యా మమేకమై ఆమె చేసిన సేవలను కొనియాడారు. రం ఆమెను భాను ప్రకాష్‌రెడ్డి, తహశీల్దార్ లక్ష్మినారాయణలు దుశ్శాలువతో సత్కరించి మెమొంటోను అందించి అభినందించారు. కార్యక్రమంలో టిడి ఏకె.ప్రేమ్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ కుప్పయ్య, సిఎస్.రవీంద్రబాబు, ఏఎస్‌ఓ లక్ష్మినాయుడు, విఆర్‌ఓలు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధి నిరుపేదలకు వరం..బొజ్జలబృందమ్మ
**.శ్రీకాళహస్తి, డిసెంబర్ 31 ప్రభాతవార్త**



సిఎం సహాయనిధి పేద ప్రజలకు వరమని ఎంఎల్‌ఏ బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి మాతృమూర్తి బొజ్జలబృందమ్మ అన్నారు. మంగళవారం పట్టణంలోని తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను రూ.7,21,798లక్షలు పంపిణీచేవారు. ఈసందర్భంగా చెక్కులు తీసుకున్న వారిలో ఉడమలపాడు గ్రామానికి చెందిన బాలసుబ్రమణ్యం(రూ.1,24,360), పాలెం కోటతులసి, శ్రీకాళహస్తి(రూ.36,100), పెద్దకనపర్తి గ్రామానికి చెందిన గురవయ్య (రూ.1,43,338), ఇలగనూరుకు చెందిన రమాదేవి (రూ.1,62,000), అరవకొత్తూరుకు చెందిన వాణి(రూ.2,56,000) చెక్కులను బృందమ్మ చేతులమీదుగా అందించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సిఎం సహాయనిధి నిరుపేదలకు వరమని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, నియోజకవర్గ పరిశీలకులు అంకయ్యచౌదరి, క్లస్టర్ ఇన్‌ఛార్జి కంఠా రమేష్, మహిళా పట్టణ అధ్యక్షులురాలు సుమతి, మల్లీశ్వరి, గోపినాథ్, వెంకటేష్‌చౌదరి, ఆర్ముగం, పాండు మరియు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీగంధం చెట్టు నరికివేతపై విచారణ చేయాలి
**.శ్రీకాళహస్తి, డిసెంబర్ 31 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన(లోబావి) పక్కనే ఉన్న శ్రీగంధంచెట్టును కొందరు గుర్తు తెలియని వ్యక్తులు రంపంతో కోసుకుని వెళ్ళడం బాధాకరం అని హిందూ ధార్మిక మండలి పట్టణ కన్వీనర్ బిజెపి జనతాపార్టీ అధ్యక్షులు గరికపాటి రమేష్‌బాబు ఆవేదన వ్యక్తం చేశారు. దక్షిణ కైలాసగిరి పర్వత పంక్తుల్లో పనసకోన ప్రాంతాల్లో కూడా హరితాభివృద్ధి సిబ్బంది విధుల్లో లోపంగానే జరిగిందన్నారు. లోబావిలో శ్రీగంధం చెట్టును కోసుకుని తీసుకువెళ్ళిన వారిని గుర్తించి శిక్షించాలని డిమాండ్ చేశారు.

## ఎస్‌టియు నూతన క్యాలెండర్ల ఆవిష్కరణ
**.తొట్టంబేడు, డిసెంబర్ 31 ప్రభాతవార్త**



ఎస్‌టియు నూతన సంవత్సర కాలమాన పట్టిక ఆవిష్కరణను ఎంఈవోలు భువనేశ్వరి, బాలయ్య చేతులమీదుగా విద్యాశాఖ కార్యాలయం నందు ఆర్పీబిఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి చేతులమీదుగా శ్రీకాళహస్తి డివిజన్ కన్వీనర్ పూడి సుధాకర్ యాదవ్, రాష్ట్ర కౌన్సిలర్ చిగ్రిహరికృష్ణ, ఎస్‌టియు మండల అధ్యక్షులు రమణయ్య, శ్రీనివాసులు, ఎంఈవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఏపి ఎన్‌జిజిఓ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంపిక
**శ్రీకాళహస్తి, డిసెంబర్ 31 ప్రభాతవార్త**



ఏపి ఎన్‌జిజిఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అలపర్తి విద్యాసాగర్‌ను ఎన్నుకున్నారు. మంగళవారం విజయవాడలోని జింఖానా మైదానంలో రాష్ట్ర ఏపి ఎన్‌జిజిఓ నూతన ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి శ్రీకాళహస్తి నుంచే కాకుండా ఉమ్మడి చిత్తూరు జిల్లా నాయకులు అంతేకాకుండా పలమనేరు, తిరుపతికి చెందిన పలువురు హాజరయ్యారు. ఈసందర్భంగా నూతనంగా ఎన్నికైన రాష్ట్ర ప్రధాన కార్యదర్శిని భారీపూలమాల, దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కెవి.రాఘవులు, జిల్లా కార్యదర్శి రఘు, ఉపాధ్యక్షుడు మహేష్, నరేష్, లక్ష్మిపతి, రెడ్డప్ప, నాగరాజు, భాస్కర్, శ్రీనివాసులు, రవిశంకర్, పలమనేరు నుంచి ఆనందబాబు, శ్రీకాళహస్తి ఎన్జీవో అధ్యక్షులు మరియు పంచాయతీరాజ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సి.చెంచురత్నం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి గజేంద్ర సింగ్ శిఖావత్ ను కలిసిన పిసి రాయులు.
**తిరుపతి విద్య డిసెంబర్ 31 ప్రభాత వార్త.**



భారత ప్రభుత్వ సాంస్కృతిక,పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ శిఖావత్ ను కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ చైర్మన్, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సభ్యుడు డాక్టర్ పిసి రాయులు మంత్రి గజేంద్ర సింగ్ శిఖావత్ ను మర్యాదపూర్వకంగా కలిశారు.మంగళవారం పర్యటన సందర్భంగా తిరుపతికి విచ్చేసిన ఆయనను పీసీ రాయులు దృశ్యాలవాతో సత్కరించి పూల బొకేను అందించారు.అలాగే తిరుపతిలో జరుగుతున్న పలు రాజకీయాల గురించి అడిగి తెలుసుకున్నారు.

## విద్యార్థులకు చక్కటి పౌష్టికాహారంతోనే ఆరోగ్యం
**– మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు**



**కుప్పం, డిసెంబర్ 31 ప్రభాతవార్త** విద్యార్థులకు తల్లిదండ్రులు చక్కటి పౌష్టికాహారం అందిస్తేనే పిల్లలు ఆరోగ్యంగా ఎదుగుతారని కుప్పం మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం స్థానిక టేలర్ హైస్కూల్‌లో ఫుడ్ ఫెస్ట్‌ను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కమీషనర్ మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలను బడికి పంపడమే కాక వారి చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. విద్య యొక్క ప్రాధాన్యతను పిల్లలకు తెలియజేయాలన్నారు. పిల్లల్లో చిన్నతనం నుంచే కష్టపడేతత్వాన్ని అలవాటు చేయాలన్నారు. పిల్లలు చదువును ఇష్టంగా చదివేలా చూడాలన్నారు. పిల్లల ఆసక్తి, ఆలోచనా విధానాలు, సమాజ తీరు గురించి వివరించారు. ఈసందర్భంగా విద్యార్థులు పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలను ప్రదర్శించారు.టేలర్ హైస్కూల్ పూర్వ విద్యార్థులు బిఎం దయానిధి, డా॥ సుదర్శన్, హఫీజ్, వివి అజిత్ ఆనంద్, శరవణ, మునాఫ్, సురేష్, తౌసిఫ్, భాగ్యరాజ్, రియాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కెఇసికి అటానమస్ హోదాతో ప్రత్యేక గుర్తింపు
**– అనంతపురం జెఎన్‌టియు వి.సి. ప్రొఫెసర్ సుదర్శనరావు**
**– కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ నూతన అకడమిక్ కేలండర్ ఆవిష్కరణ !!**

**కుప్పం, డిసెంబర్ 31 ప్రభాతవార్త**



కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్‌కు పదేళ్ల పాటు అటానమస్ హోదా రావడం హర్షణీయమని అనంతపురం జెఎన్‌టియు వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సుదర్శన రావు పేర్కొన్నారు. మంగళవారం కెఇసిలో ఆయన నూతన అకడమిక్ కేలండర్ మరియు కళాశాల బ్రోచర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్యారంగంలో దేశానికి అత్యుత్తమ నాణ్యత ప్రమాణాలతో కూడిన విద్యార్థులను తీర్చిదిద్దుతూ బోధన, పరిశోధనల్లో తనకంటూ కెఇసి ప్రత్యేక గుర్తింపు సాధించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. యుజిసి అటానమస్ హోదా గుర్తింపు నేపథ్యంలో విద్యారంగంలో ఆధునిక సాంకేతికను గరిష్టంగా వినియోగిస్తూ తన పాఠ్యాంశాల రూపకల్పనకు ప్రణాళిక సిద్ధం చేసిందన్నారు. చక్కటి మౌలిక వసతులతో పాటు అపార అనుభవం కలిగిన అధ్యాపకులతో కెఇసి ముందడుగు వేయడం గర్వించదగ్గ విషయమన్నారు. సివిల్, మెకానికల్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ట్రిపుల్‌ఇ, ఎఐ, మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్ విభాగాల్లో యుజి, పిజి కోర్సులు అందిస్తోందన్నారు. అలాగే డిప్లమో కోర్సులు సైతం అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా॥ సుధాకర్‌బాబు, హెచ్‌ఒడి గణేష్ పాల్గొన్నారు.

## కేంద్రమంత్రి జాదవ్‌ను కలసి ప్రభుత్వ విప్ డా.కంచర్ల శ్రీకాంత్
**కుప్పం, డిసెంబర్ 31 ప్రభాతవార్త**



కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జాదవ్‌ను ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుమల శ్రీవారి దర్శనం నిమిత్తం కేంద్రమంత్రి జాదవ్ తిరుమలకు చేరుకోగా ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్ కేంద్రమంత్రికి స్వాగతం పలికి అనంతరం దుశ్శాలువతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందించారు.

## ప్రజల జీవితాల్లో ప్రభుత్వం వెలుగులు
**– ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు**

**చిత్తూరు, డిసెంబర్ 31 ప్రభాతవార్త:**



రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతున్నదని ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడులు పేర్కొన్నారు. చిత్తూరు నియోజకవర్గంలో మంగళవారం సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు, మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్‌లు పాల్గొని వృద్ధులు, వికలాంగులకు పెన్షన్ల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఒక రోజు ముందుగానే పెన్షన్లను పంపిణీ చేస్తోందన్నారు. పెన్షన్లకు అర్హులై వుండి పెన్షన్లు అందని వారిని ప్రభుత్వం గుర్తిస్తున్నదని, వారికి తప్పకుండా న్యాయం చేస్తామని ఎంపీ, ఎమ్మెల్యేలు పేర్కొన్నారు.

## భూసమస్యలు గ్రామసభలతో పరిష్కారం
**పూతలపట్టు, డిసెంబర్ 31 ప్రభాతవార్త:**



రీ-సర్వేలో రైతులు, ప్రజలకు తలెత్తిన సమస్యలు ప్రస్తుతం నిర్వహిస్తున్న గ్రామసభలతో పరిష్కారం అవుతాయని తహసిల్దారు గురప్ప అన్నారు. మండలంలోని పూతలపట్టు సచివాలయం-1 పరిధిలో జరిగిన రెవెన్యూ సదస్సులో తహసిల్దారు గురప్ప పాల్గొన్నారు. ఈ సమావేశంలో తహసిల్దారు మాట్లాడుతూ భూసమస్యలను తమ దృష్టికి తీసకువస్తే వాటిని సత్వరం పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం సీనియర్ నాయకులు గుంటూరు మురళీ, సర్పంచ్ మాసలామని, డిప్యుటీ తహసిల్దారు మునికృష్ణ, విఆర్‌ఓ ధరణి, సెక్రటరీ వెంకటరమణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఎంపీ అండ
**బంగారుపాళ్యం, డిసెంబర్ 31 ప్రభాతవార్త:**



ఈ నెల 20వ తేదీ జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మృతుడి కుటుంబానికి అండగా వుంటామని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు హామీ ఇచ్చారు. మంగళవారం సాయంత్రం మండలంలోని నలగాంపల్లి దళిత వాడకు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు విచ్చేశారు. ఈ నెల 20న బంగారు పాళ్యం నుండి నలగాంపల్లికి ద్విచక్ర వాహనంపై దినకర్ వెళ్తూ ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడు తెలుగుదేశం కార్యకర్త కావడంతో మృతుడి కుటుంబసభ్యులను ఎంపీతో పాటు పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్, మండల టిడిపి అధ్యక్షులు జయప్రకాష్‌లు పరామర్శించారు. ఎంపీ తన సొంత నిధుల నుండి బాధిత కుటుంబానికి రూ.2.5 లక్షలు ప్రకటించగా ఎమ్మెల్యే, ఎన్‌ఫిఎస్ కుటుంబసభ్యులు 2.5 లక్షల రూపాయలు ప్రకటించారు. మృతుడి భార్య బిందుకు పార్టీ పరంగా అండగా వుంటామని ఎంపీ హామీ ఇచ్చారు. ప్రభుత్వ పరంగా పక్కా గృహ నిర్మాణం, పిల్లల చదువును ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా సహాయం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి కార్యదర్శి జనార్ధన్‌గౌడు, టిడిపి నాయకులు బుస్సా నాగరాజు, ఎన్‌పి ధరణి, ఎన్‌పి జయచంద్రనాయుడు, గ్రామ సర్పంచ్ షీబా స్వామిదాసు తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్
చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## సమసమాజ స్థాపనకే పౌరహక్కుల దినోత్సవం : మాధవి
**చౌడేపల్లి, డిసెంబర్ 31 ప్రభాతవార్త**



సమసమాజ స్థాపన కోసం పౌరహక్కుల దినోత్సవాన్ని ప్రతినెలాఖరులో నిర్వహిస్తున్నట్లు డిటి మాధవి అన్నారు. చౌడేపల్లి పరిధిలోని పొదలపల్లిలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. గ్రామంలో అంటరానితనంపై ఆరా తీసారు. అందరం అన్నదమ్ముల్లా కలసి మెలసి వున్నామని, ఆమెకు గ్రామస్తులు వివరించారు. దళితస్మశాన వాటికకు దారి లేదనీ, అంబేద్కర్ భవన స్థలం విషయంలో పోలీసులు న్యాయం చేయలేదని బ్యాంకు రెడ్డెప్ప, కూరపర్తి లక్ష్మీనారాయణ, రమణ, కూరపర్తి శ్రీనివాసులు డిటి దృష్టికి తీసుకెళ్ళారు. విచారణ జరిపి న్యాయం చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. అనంతరం సామాజిక ఫించన్లు, భూమి పాసుపుస్తకాల కోసం పలువురు వినతి పత్రాలందించారు. ఆర్‌ఐ భారతి, విఆర్‌ఓ విజయ్‌కుమార్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మహేష్, టీస్టాల్ లోకేష్, గ్రామస్తులు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మహిళ మృతి
**చౌడేపల్లి, డిసెంబర్ 31 ప్రభాతవార్త**



రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మహిళ మృతి చెందిన సంఘటన చోటు చేసుకొంది. డిసెంబర్ 30న బోయ కొండ మార్గంలో చిన్నకొండామర్రి వద్ద స్కూటర్‌ను కారు ఢీకొన్నది. ఈ ప్రమాదంలో కీలపట్ల మాదిగపల్లికి చెందిన భార్యాభర్తలు రెడ్డెప్ప, శివకుమారిలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శివకుమారి మృతి చెందింది. ఈమేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహానికి అక్కడే పోస్టుమార్టం నిర్వహించి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ నాగేశ్వరరావు తెలిపారు.

## గణనాధుని సన్నిధిలో శాసనమండలి సభ్యులు
**కాణిపాకం, డిసెంబర్ 31 ప్రభాతవార్త:**



కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని మంగళవారం పలువురు ఎమ్మెల్సీలు దర్శించుకున్నారు. గుంటూరు, కడప శాసనమండలి సభ్యులు ఎల్.అప్పిరెడ్డి, ఎన్‌వి.రామచంద్రారెడ్డిలు కాణిపాకం స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారి ఆలయ ఏఈఓ హరిమాధవరెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేద మండపంలో ఆశీర్వచనం చేసి స్వామివారి చిత్రపటాన్ని, శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అలాగే వారు శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా ప్రత్యేకపూజలు నిర్వహించారు. వారి వెంట ఆలయ సూనపరెండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

## బీసీవై ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు
**– జనవరి 3న విజయవాడలో పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ వెల్లడి**

**పుంగనూరు, డిసెంబర్ 31, ప్రభాతవార్త**
భారత చైతన్య యువజన పార్టీ ఆధ్వర్యంలో జనవరి 3న మహిళా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు విజయవాడలో నిర్వహించనున్నట్టు ఆ పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ తెలిపారు. భారత దేశ మొట్ట మొదటి మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త, ఆడపిల్లల విద్య కోసం పాటుపడిన సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా ఆ రోజున జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించే ఆచారం మరుగున పడిపోయిందన్నారు. ఆ రోజు విశిష్టతను కూడా ప్రభుత్వాలు, పాలకులు మరిచిపోయారని అన్నారు. అయితే,అన్ని వర్గాల సంక్షేమం, మహిళా అభ్యున్నతి కోసం ఆవిర్భవించిన బీసీ యువజన పార్టీ ఆధ్వర్యంలో ఏటా ఈ వేడుకలు నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధం చేశామని చెప్పారు. ఇందులో భాగంగా, జనవరి 3న విజయవాడలోని హోటల్ లెమన్ ట్రీ పీమియర్ లో ఈ కార్యక్రమం జరుగుతుందని, రాష్ట్ర వ్యాప్తంగా బోధనల్లో ప్రతిభ చాటిన మహిళా ఉపాధ్యాయనిలను ఎంపిక చేశామని, వారిని సత్కరించి, అవార్డులు అందిస్తామని రామచంద్ర యాదవ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

## చంద్రబాబు, చల్లా బాబుల స్ఫూర్తితో సభ్యత్వాలు
**పుంగనూరు రూరల్, డిసెంబర్ 31, ప్రభాతవార్త**



రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పుంగనూరు దేశం నేత చల్లా బాబుల స్ఫూర్తితో నియోజక వర్గంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నామని దేశం నాయకుడు, వాల్మీకి సంఘం రాష్ట్ర నేత కనుమ కుంట సుకుమార్ బాబు వెల్లడించారు. మంగళవారం ఆయన పట్టణంలోని హైస్కూల్ వీధి నుంచి సభ్యత్వాలు ప్రారంభించి మధ్యాహ్నం లోగా హైస్కూల్ వీధి, ఏడూరు గ్రామాలలో మొత్తం 200 సభ్యత్వాలు పూర్తి చేశారు. కార్యక్రమంలో ఆయన సతీమణి కనుముకుంట సులోచన మహిళా సభ్యత విభాగానికి బాధ్యత వహిస్తూ, పెద్ద ఎత్తున మహిళా సభ్యత్వాలను నమోదు చేయించేందుకు కృషి చేస్తున్నారు. ప్రజాభివృద్ధి, ప్రజా సంక్షేమం, అణగారిన వర్గాల కోసం తపిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ బాబు, నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ చల్లా బాబులకు అండగా నిలబడేందుకు కంకణం కట్టుకున్నామని ఆయన వివరించారు.

## స్త్రీనిధి నిధులు స్వాహా చేసిన సంఘమిత్ర
**కడ పి.డి.కి మహిళల ఫిర్యాదు**

**కుప్పం, డిసెంబర్ 31 ప్రభాతవార్త**
మండలంలోని వి.మిట్టపల్లి గ్రామంలో స్వయం సహాయక సంఘాల సంఘమిత్రగా పనిచేస్తున్న పెరుమాళ్ అనే వ్యక్తి స్త్రీ నిధి నిధులు స్వాహా చేసినట్లు గ్రామంలోని స్వయంసహాయక సంఘాల మహిళలు మంగళవారం కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్‌కు ఫిర్యాదు చేశారు. సదరు సంఘమిత్ర గ్రామంలోని అన్ని గ్రూపుల లావాదేవీల్లో పలు అవకతవకలకు పాల్పడ్డాడని పేర్కొన్నారు. మహిళలు బ్యాంకులకు చెల్లించే రుణాలు సక్రమంగా చెల్లిస్తున్నా సంఘమిత్ర ఆ నగదును బ్యాంకుల్లో జమ చేయడం లేదని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇప్పటివరకు ఇలా రెండు లక్షల రూపాయల మేర నిధులను అతను పక్కదారి పట్టించినట్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో సిసి పాత్రపై సైతం విచారణ చేయించాలని కోరారు. ఈ అవకతవకలపై తగు విచారణ చేయించి సంఘమిత్రను తొలగించాలని మహిళలు పి.డి.ని కోరారు. దీనిపై పి.డి. మాట్లాడుతూ ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులచే విచారణ చేయించి తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కాగా గుడుపల్లె మండల కేంద్రంలో ఉన్న పాత సంఘమిత్రను తొలగించి కొత్త సంఘమిత్రను నియమించుకున్నామని అయితే పాత సంఘమిత్ర మరలా తానే ఉండాలని ప్రయత్నాలు చేస్తోందని ఆ సంఘమిత్రను మరలా నియమించరాదని కోరుతూ గుడుపల్లె మహిళా సంఘాలు సైతం కడ పి.డి.కి ఫిర్యాదు చేశారు.

## అంకుతోటపల్లిలో వ్యక్తి ఆత్మహత్య
**చౌడేపల్లి, డిసెంబర్ 31 ప్రభాతవార్త**
మండలంలోని ఎ.కొత్తకోట పంచాయతీ అంకుతోటపల్లిలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం చోటు చేసుకొంది. అంకుతోటపల్లికి చెందిన వెంకటేష్(58)వ్యవసాయ కూలీగా జీవిస్తున్నాడు. కుటుంబంలో ఏర్పడ్డ కలహాల మూలంగా మనస్తాపానికి గురైన అతను ఇంట్లో వున్న పశువులకు సంబంధించిన పిడుదలమందు సేవించాడు. అపస్మారక స్థితిలో పడున్న అతన్ని కుటుంబ సభ్యులు పుంగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే వెంకటేష్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు.

# తిరుపతి డివిజన్

## స్విమ్స్ సిటీ సర్జరీ విభాగంలో సంక్లిష్టమైన ఆపరేషన్ విజయవంతం
**తిరుపతి హెల్త్, డిసెంబరు 31 ప్రభాతవార్త ః**



స్విమ్స్ నందు చిన్న తాయారు గ్రామం ఎస్ఆర్‌పురం మండలం చిత్తూరు జిల్లా వెల్లిగరం శ్యామల డిసెంబరు 10,2024 న స్విమ్స్ క్యాజువాలిటీలో అడ్మిషన్ అయింది. సిటీ సర్జరీ విభాగం వైద్యులు వైద్య పరీక్షించి పేషంటుకు శ్వాస సరిగా తీసుకోవడం, గుండె సరిగా పనిచేయక పోవడం వలన ఆపరేషన్ నిర్వహించుటకు సిటీ సర్జరీ విభాగంలో అడ్మిట్ చేసినట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు. స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డాక్టర్ ఆర్.వి కుమార్ మాట్లాడుతూ స్విమ్స్‌లో ఇలాంటి సంక్లిష్ట ఆపరేషన్లు చేయడం అభినందనీయమని విజయవంతమైన ఆపరేషన్లు నిర్వహించిన సిటీ సర్జరీ,అనస్తీషియా విభాగాల వైద్య బృందానికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిటీ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ సత్యవతి, డాక్టర్ అలోక్ సమంత్‌రే డాక్టర్ సుముదు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీటీడీ యాజమాన్యం స్విమ్స్ డాక్టర్ల బృందాన్ని అభినందించారు.

## సత్యవేడు ప్రగతి వైపు నడిపిద్దాం



**సత్యవేడు, డిసెంబరు 31 ప్రభాతవార్త:** నూతన సంవత్సరంలో సత్యవేడు నియోజకవర్గాన్ని అభివృద్ధి పదం వైపు నడిపించడానికి టీడీపీ శ్రేణులు సంసిద్ధంగా ఉండాలని ప్రముఖ పారిశ్రామికవేత్త, టీడీపీ క్రియాశీలక నేత గంగాప్రసాద్ కోరారు. మంగళవారం సూళ్లూరుపేటలో గంగాప్రసాద్ ఇంటి వద్ద కలసి ముందస్తు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే ఆదిమూలం ప్రత్యేక అతిథిగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 2025 సంవత్సరంలో విభేదాలకు దూరంగా, ఐక్యమత్యంగా టీడీపీలోని అందరూ అభివృద్ధి పదం వైపు అడుగులు వేయాలని గంగప్రసాద్ కోరారు. నూతన సంవత్సరంలో అయినా క్రియాశీలక నామినేటెడ్ పోస్టులు భర్తీ చేయడానికి రాష్ట్ర పార్టీ అధిష్టానం చొరవ చూపే విధంగా గంగప్రసాద్ అడుగులు వేయాలని టీడీపీ శ్రేణులు ముక్తకంఠంతో అభ్యర్థించారు.

## విహారయాత్రలో విషాదం
**బుచ్చినాయుడు కండ్రిగ, డిసెంబరు 31 ప్రభాతవార్త:**
బీఎన్ కండ్రిగ మండలం తమిళనాడుకు చెందిన ఆరు మంది ఉబ్బలమడుగుకు విహారయాత్రకు రాగా అందులో ఒకరు కనిపించకపోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించారు. సమాచారం అందుకున్న సీఐ తిమ్మయ్య, ఎస్ఐ విశ్వనాథనాయుడు సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేయగా అతను ప్రమాదవశాత్తు రాళ్ళ మధ్యలో ఇరుక్కుని శవమై తేలాడు. ఈ గాలింపు చర్యల్లో పోలీసు వారు, ఫైర్ సిబ్బంది అలాగే అటవీ సిబ్బంది సహాయంతో శవాన్ని వెలికి తీశారు. శవాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలను దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విశ్వనాథనాయుడు తెలిపారు.

## మరో రెండేళ్లపాటు పాఠశాల వసతికి అవకాశం ఇవ్వండి
**తిరుపతి విద్య డిసెంబర్ 31 ప్రభాత వార్త:**



స్థానిక జూపార్క్ రోడ్డులోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలను ఎస్వీయూ భవనంలో కొనసాగించుకునేందుకు అవకాశం కల్పించాలని ఆ పాఠశాల ప్రిన్సిపల్ కే రేష్మా వర్సిటీ అధికారులను అభ్యర్థించారు.ఈ మేరకు ఆమె పాఠశాల సిబ్బందితో కలసి మంగళవారం వీసీ సీహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడుకు వినతిపత్రం సమర్పించారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడు తూ చంద్రగిరి నియోజకవర్గం ఎర్రావారిపాలెం మండలం లోని ఉదయమాణిక్యంలో పాఠశాలకు స్థలం సమకూర్చడం జరిగిందని పనులు ప్రారంభానికి మరో రెండేళ్ల పట్టే అవకాశం ఉందన్నారు.2023లో బీసీ గురుకుల పాఠశాలను అలిపిరి,జూపార్క్ రోడ్డులోని ఎస్వీయూలో రెండేళ్ల పాటు వర్సిటీకి చెందిన భవనాలలో తాత్కాలికంగా ఏర్పాటు చేశారన్నారు.రెండేళ్లు పూర్తికావస్తున్న నేపథ్యంలో మరో రెండేళ్ల పాటు పాఠశాల అదే స్థలంలో నడుపుకునేందుకు అవకాశం కల్పించాలని అధికారులకు విన్నవించామని తెలిపారు

## వర్సిటీలో అదనపు నిఘా కెమెరాలు
**తిరుపతి విద్య డిసెంబర్ 31 ప్రభాత వార్త:** ఎస్వీయూలో గత కొన్ని రోజులుగా చిరుత సంచరిస్తున్న నేపథ్యంలో వర్సిటీలోని పలు అనుమానిత ప్రాంతాలలో నిఘా కెమెరాలను ఫారెస్ట్ అధికారులు అమర్చారు. డీఎఫ్,ఎస్ఆర్ఆ ఆదేశాలమేరకు సిబ్బంది మంగళవారం వర్సిటీలో ఆవరణలో 10 ప్రత్యేక కెమెరాలను ఏర్పాటు చేశారు.చిరుత కదలికలను ఎప్పటికప్పుడు తెలుసుకుని తగు చర్యలు తీసుకునేందుకు సీసీ పుటేజ్ అవసరమని అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా ఫారెస్ట్ సిబ్బంది మాట్లాడుతూ వర్సిటీ వీసీ సిహెచ్ అప్పారావు,రిజిస్ట్రార్ భూపతి నాయుడు అభ్యర్థన మేరకు ఎస్వీ యూనివర్సిటీలో ప్రత్యేక నిఘాని ఏర్పాటు చేశామన్నారు.చిరుత తనకన్నా చిన్న సైజు కలిగిన కుక్కలను, జింకలను,ఆవులు గేదెలు ఆహారంగా తీసుకెళుతుందన్నారు.విద్యార్థులు వర్సిటీలో ఉద్యోగులు రాత్రి 8 నుంచి ఉదయం 6గంటల వరకు వర్సిటీలో సంచరించకుండా జాగ్రత్తగా వహించాలన్నారు.

## 3న హుండీల లెక్కింపు

శ్రీకాళహస్తి,డిసెంబర్ 31 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరుని ఆలయంలో భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను జనవరి 3న హుండీల లెక్కింపు ఏర్పాటు చేసినట్లు కార్యనిర్వహణాధికారి టి.బాపిరెడ్డి మంగళవారం వివరించారు. భక్తులు స్వామి అమ్మవార్ల హుండీల్లో 25 రోజుల పాటు కానుకలను సమర్పించారు. అలాగే రాహుకేతుదోష నివారణ పూజలలో వాడిన వెండి నాగపడగలను తీయనున్నారు. ఇందుకు నియమించిన సిబ్బంది ఉదయం 7గంటలకు గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద హాజరు కావాలని ఇఒ బాపిరెడ్డి ఆదేశించారు.

## ఏర్పేడు మండల పార్టీ అధ్యక్షుని ఎన్నిక

శ్రీకాళహస్తి రూరల్,డిసెంబర్ 31 ప్రభాతవార్త



ఏర్పేడు మండల భారతీయ జనతాపార్టీ నూతన అధ్యక్షుని ఎన్నికను రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్‌కుమార్ సమక్షంలో నిర్వహించారు. పార్టీ సమావేశంలో నూతన అధ్యక్షుడుగా తిరుమల శెట్టి నరేష్‌ను ఎన్నుకున్నట్లు పార్టీ ప్రకటించిం ది. మండలంలోని పార్టీకి సంబంధించిన నాయకుల అభిప్రాయాలను సేకరించారు. పాత కమిటిని రద్దు చేసి కొత్త కమిటిని ఎన్నుకున్నట్లు కోలా ఆనంద్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కార్యదర్శి మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, కుప్పా ప్రసాద్, సి.వెంకటేశ్వర్లు, మునస్వామి రెడ్డి, మునిరాజా, మునీశ్వరి, వెంకట సుబ్బయ్య, బాలాజీ, మునెయ్య, వెంకటగిరి హరి, చెంగయ్య, బాలగుర్నాధం తదితరులు పాల్గొన్నారు.

## శివయ్య సేవలో రాజంపేట ఎంపి

శ్రీకాళహస్తి,డిసెంబర్ 31 ప్రభాతవార్త



దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరుని మంగళవారం రాజంపేట పార్లమెంటు సభ్యుడు పెద్ది రెడ్డి మిథున్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయం వద్ద వైకాపా నాయకులు ఘనస్వాగతం పలికారు. మాజీ శాసనసభ్యుడు బియ్యపుమధు సూధన రెడ్డి, తొట్టంబేడు మండల పార్టీ రథసారధి ఉన్నం వాసుదేవనాయుడు, మాజీ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, సిరాజ్‌బాషా, సురేష్, వెంకటేశ్వర్లు, మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ వయ్యాల కృష్ణారెడ్డి, యశ్వంత్, సందీప్‌రెడ్డి తదితరులు స్వాగతం పలికారు. ఆలయంలో స్వామి అమ్మవార్లను దర్శించుకున్న ఆయనకు మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులచే ఆశీర్వచనాలు తీర్థ ప్రసాదాలు అందించారు.

## పాకాల ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన సంజీవరాయుడు

పాకాల, డిసెంబర్ 31, ప్రభాతవార్త



పాకాల మండలం పాకాల పోలీస్ స్టేషన్ లో పాకాల ఎస్ఐగా ఎంఎన్ సంజీవరాయుడు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పాకాల ఎస్.ఐ సంజీవరాయుడు మాట్లాడుతూ తిరుపతి ఎస్పీ ఆఫీస్ వి.ఆర్ నుంచి పాకాల ఎస్.ఐగా మంగళవారం బాధ్యతలు చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు. పాకాల పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు నా వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.



## ఆటోనగర్ ఇండస్ట్రియల్ ఏరియా

తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 31, ప్రభాతవార్త

నగరంలోని ఆటోనగర్‌కి పక్కన ఉన్న ఇండస్ట్రియల్ ఏరియాను పరిశుభ్రంగా ఉంచుకోవాలని దుకాణదారులను నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ఆదేశించారు. మంగళవారం ఉదయం ఆటోనగర్ ఇండస్ట్రియల్ ఏరియా, జీవకోన ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు, రోడ్లపై గుంతలు పూడ్చే విధానాన్ని ఆరోగ్య శాఖ, ఇంజినీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. ఆటోనగర్ ఇండస్ట్రియల్ ఏరియాలో రోడ్లపై పక్కన ఎక్కడపడితే అక్కడ వ్యర్థాలు, టైర్లుపడేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీఐఐసీ వారికి నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే వారి వారి దుకాణాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకునేలా అవగాహన కల్పించాలని అధికారులకు చెప్పారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇండస్ట్రియల్ ఏరియా లో అపరిశుభ్రతపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తుండడంతో అధికారులతో కలసి పరిశీలించామని అన్నారు. ఎక్కడపడితే అక్కడ టైర్లు, వ్యర్థాలు వేయడంతో అపరిశుభ్రంగా ఉందన్నారు. ఈ ఏరియా నగరపాలక సంస్థ పరిధిలో ఉన్నా ఏపీఐఐసీ కి చెందినదని అన్నారు. కాబట్టి తాము పారిశుద్ధ్య పనులు చేసేందుకు, వారు మనకు యూజర్ చార్జీలు చేస్తే పారిశుద్ధ్య పనులు చేయడం జరుగుతుందని అన్నారు. అయితే ఇక్కడ అపరిశుభ్రత వలన ఆటోనగర్ వాసులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కమిషనర్ వెంట కార్పొరేటర్ అన్నా అనిత, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, డి.ఈ. రమణ, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, ఏసిపి బాలాజి, సర్వేయర్ కోటేశ్వర రావు, శానిటరీ సూపర్ వైజర్ సుమతి,ు ఉన్నారు.

## జూనియర్ లెక్చరర్ జయరామయ్య ఉద్యోగ విరమణ మహోత్సవంలో శాప్ చైర్మన్



***తిరుపతి క్రీడ, డిసెంబర్ 31, ప్రభాతవార్త*** వడమాల పేటలోని బాలాజీ కల్యాణ మండపంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ జూనియర్ లెక్చరర్, అండర్ 19 ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్.జయరామయ్య ఉద్యోగ విరమణ మహోత్సవంలో శాప్ చైర్మన్ రవినాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జయరామయ్యని సత్కరించారు. జూనియర్ లెక్చరర్‌గా ఆయన చేసిన సేవలను శాప్ చైర్మన్ కొనియాడారు. ఉద్యోగ విరమణ చేసినప్పటికీ క్రీడారంగానికి మీలాంటి వారి సేవలు అవసరమని, క్రీడారంగం అభివృద్ధికి తోడ్పాటునందించాలని రవినాయుడు ఆకాంక్షించారు.

## రాస్ వృద్ధాశ్రమంలో అన్నదానం

కార్వేటినగరం, డిసెంబర్ 31 ప్రభాతవార్త :



రాస్ వృద్ధాశ్రమంలో మండలంలోని పాదిరికుప్పం గ్రామానికి చెందిన కీర్తిశేషులు సుబ్బయ్య వర్ధంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యులు వృద్ధాలకు అన్నదానం చేశారు. సుబ్బయ్య జ్ఞాపకార్థం ఆయన వర్ధంతి రోజున వృద్ధాలకు పండ్లు, పాలు అందజేశారు. అలాగే అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సతీమణి కంజమ్మ, కుమారులు, కోడళ్ళులు తులసిరామ్, కృష్ణవేణి, లోకనాధం, సుబ్బలక్ష్మి, కుమార్తెలు మనవాళ్ళు, మనవరాళ్ళు మో తిలాల్, భార్గవి, పద్మజ, రామోహన్‌రావు, వసుంధర, హేమమోహన్‌రావు, గుణశ్రీ, మోనిషా, దినేష్‌కాంత్, హన్ష, గగన్, దీప్‌రావు, జియాన్స్, వేదశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువు రెండు నెలలు పొడిగింపు

-జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్

**తిరుపతి కలెక్టరేట్, డిసెంబరు 31 ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువు ముగుస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల కాల పరిమితిని రెండు నెలలు పాటు జనవరి 1, 2025 నుంచి ఫిబ్రవరి 28, 2025 వరకు, కొత్త కార్డుల జారీ ప్రక్రియ చేయడం గానీ, ఏది ముందు జరిగితే అప్పటి వరకు పొడిగింపు ఉత్తర్వులు జారీ చేస్తూ సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు హిమాన్షు శుక్లా మంగళవారం నాడు ఆదేశాల జారీ చేసిన నేపథ్యంలో ప్రస్తుతం డిసెంబరు 31, 2024 నాటికి అక్రిడిటేషన్ కార్డులు కలిగి పనిచేయుచున్న పాత్రికేయులకు మాత్రమే జనవరి 1,2025 నుంచి ఫిబ్రవరి 28, 2025 వరకు పొడిగింపు సౌకర్యం కొనసాగుతుందని, సంబంధిత మీడియా యాజమాన్యం వారు వారి సంస్థలో పని చేయుచున్న జర్నలిస్టుల వివరాలు జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖాధికారి, తిరుపతి వారి కార్యాలయంలో వీలైనంత తొందరగా అందజేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలియజేశారు.

## రక్తదానం

తిరుపతి హెల్త్, డిసెంబరు 31 ప్రభాతవార్త :



అఖిల భారతీయ యాదవ మహాసభ రాష్ట్ర యువత అధ్యక్షులు శంకర్ యాదవ్ జనవరి 1,2025 పుట్టిన రోజు సందర్భాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక అన్నారావు సర్కిల్ సమీపంలోని తన కార్యాలయంలో రక్తదాన కార్యక్రమాన్ని శంకర్ యాదవ్ ప్రారంభించి రక్తదానం గొప్పతనాన్ని గురించి వివరించారు. ప్రతి ఒక్కరు రక్తదానం చేసి మనిషి జీవితాన్ని నిండు నూరేళ్ళు కాపాడువచ్చునన్నారు. నేడు రుయా ఆస్పత్రి వద్ద పేదలకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యువతశ్రీకాంత్, అవినాష్, సాయి, శ్రీను, చైతన్య, నితీష్, రుయా ఆస్పత్రి సిబ్బంది, మెడికల్ ఆఫీసర్ హరిత, స్టాఫ్ నర్స్ మంజుల, ల్యాబ్ టెక్నిషియన్ రఘురాం చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## అగస్తీశ్వరాలయంను అభివృద్ధి చేయండి

**తొట్టంబేడు, డిసెంబర్ 31 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధ ఆలయంగా మండలంలోని పెద్దకన్నలిలో వెలసిన శ్రీదుర్గాదేవి సమేత అగస్తీశ్వరస్వామి దేవాలయంను అభివృద్ధి చేయాలని శ్రీకాళహస్తీశ్వరాలయ కార్యనిర్వహణాధికారి పి.బాపిరాజును గ్రామస్తులు కోరారు. మంగళవారం ఆయన శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా వెలసి ఉన్న ఆలయాలను పరిశీలించి అక్కడ జరుగుతున్న దూపదీప నైవేద్యాల గురించి వివరించారు. ఈసందర్భంగా ముందుగా ఆలయంలో వెలసిన స్వామిఅమ్మవార్లను దర్శించుకుని ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఏళ్ళ తరబడి ఉన్న ఆలయాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. పెద్దకన్నలి పరిసర గ్రామాల్లో నిరుపేదలు నివాసం ఉంటున్నారని తల్లిదండ్రులు తమ బిడ్డలకు వివాహాలు జరుపుకోవాలంటే కళ్యాణమండపాన్ని నిర్వహించాలని ఇందుకోసం ఆలయ స్థలం ఉందని ఇఒకు గ్రామస్తులు తెలిపారు. ప్రసాదాల తయారీకి వంటగది, మరుగుదొడ్ల నిర్మాణం, ఉత్సవగొడుగుతో పాటు వర్షాలకు లీకేజీ అవుతోందని దీన్ని అరికట్టేందుకు చర్యలుతీసుకోవాలని ఇఒకు వినతిపత్రం అందించారు. దీనిపై స్పందించిన ఇఒ మహాశివరాత్రిలోపు పనులు చేపట్టి పూర్తిచేస్తామన్నారు. కార్యక్రమాలో ఇఒ బాపిరెడ్డితో పాటు ఈఈ మురళీధర్‌రెడ్డి, కిషోర్, స్తపతి కుమార్, చిన్న ఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్య, గ్రామస్తులు రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ప్రతిభ వర్సిటీకి గర్వకారణం

***తిరుపతి విద్య డిసెంబర్ 31 ప్రభాత వార్త:*** చెన్నై ఎస్ఆర్ఎం వర్సిటీ వేదికగా గత మూడు రోజులుగా జరిగిన సౌతేజోన్ అంతర్ వర్సిటీసాంస్కృతిక పోటీలలో ఎస్వీయూ విద్యార్థులు సాధించిన విజయాలతో వర్సిటీ గర్వపడుతోందని వీసీ సీహెచ్ అప్పారావు కొనియాడారు. మంగళవారం వర్సిటీ వీసీ ఛాంబర్లో ఆయన రిజిస్ట్రార్ భూపతినాయుడుతో కలసి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ వర్సిటీ కళాకారుల బృందం 11 అంశాలలో పథకాలు సాధించిందని, విద్యార్థులు విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగస్వామ్యులు కావడం అభినందనీయమన్నారు. సౌతన్ పోటీలలో ఫైనార్ట్స్ విభాగంలో ప్రతిభ చూపిన ఓవరాల్ ఛాంపియన్గా వర్సిటీని నిలిపిన విద్యార్థుల ప్రతిభ మరువలేనిదన్నారు. సౌత్‌అన్ పోటీలలో విజయం సాధించిన బృందం నోయిడా అమిటీ వర్సిటీలో మార్చిలో జరిగే జాతీయ పోటీలలో పాల్గొంటున్నదని తెలిపారు. జాతీయ స్థాయిలో సైతం వర్సిటీ విద్యార్థులు విజయం సాధించి వర్సిటీ కీర్తిని దేశవ్యాప్తం చేయాలని ఆకాంక్షించారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ వర్సిటీ పరిధిలోని అన్ని కళాశాలల్లో అసాధారణ ప్రతిభగల విద్యార్థులు ఉన్నారని, ఇలాంటి పోటీలలో పాల్గొన్నప్పుడే ప్రతిభకు గుర్తింపు ఉంటుందన్నారు. అకడమిక్ విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలను వర్సిటీ ప్రోత్సహిస్తోందని తెలిపారు. అనంతరం ఛాంపియన్గా నిలచిన విద్యార్థులను, టీటీడీ ట్రైనర్ డాక్టర్ సాగర్ ను వీసీ, రిజిస్ట్రార్ అభినందించారు. ఈ సమావేశంలో టీమ్ మేనేజ్మెంట్ మురళీధర్, కోఆర్డినేటర్ డాక్టర్ వివేక్, ప్రొఫెసర్లు చెంద్రాయుడు, ఊక రమేష్ బాబు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ పాకనాటి హరికృష్ణ, డాక్టర్ రంజిత్, విద్యార్థులు పాల్గొన్నారు.

## కేవీబీ పురం పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ తనిఖీలు

### న బెల్టు, గంజాయిపై ఉక్కుపాదం మోపుతాం

కేవీబీ పురం, డిసెంబరు 31 ప్రభాతవార్త:

వార్షికోత్సవ తనిఖీల్లో భాగంగా పుత్తూరు డీఎస్పీ రవికుమార్ కేవీబీ పురం పోలీస్‌స్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులపై ఆరా తీసి కేసులకు సంబంధించిన ఫైల్స్ పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొనేవారు హద్దులు మీరకుండా ఎదుటివారికి, ఇబ్బందులు తలెత్తకుండా వేడుకలు జరుపుకోవాలని సూచించారు. ఈ వేడుకల్లో ఎవరైనా ఆకతాయి ప్రజలకు ఇబ్బందులు కలుగచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మిద్దికండ్రిగ, కేవీబీ పురం, కొత్తూరు, ఆధవరం గ్రామాల మార్గాల్లో వెంటనే రోడ్డు ప్రమాదాల నివారణకు సూచలను ఏర్పాటు చేశారు. అదే విధంగా గంజాయి, రేషన్ బియ్యం అక్రమ రవాణా, బెల్టు అమ్మకాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఉక్కుపాదం మోపుతామని తెలిపారు. పండుగల పేరుతో ఆదేశాలకు విరుద్ధంగా కోడి పందాలు నిర్వహించే వారిపై దృష్టిసారించాలని ఎస్ఐ ఓబయ్యకు సూచించారు.

***న సేఫ్టీ, సైరన్ లాక్ వాడకంపై అవగాహన*** గ్రామాల్లో కూడా వ్యాపారులు ప్రజలు వారి వారి ఇళ్ళతో పాటు దుకాణాలకు సేఫ్టీ సైరన్ లాకర్లను వాడాలని, పబ్లిక్ సేఫ్టీ యాక్టు సూచనల ప్రకారం విధిగా సీసీ కెమెరాలను అమర్చాలని ఆయన పిలుపునిచ్చారు. సేఫ్టీ సైరన్ లాక్ వాడకంపై ప్రజలు, వ్యాపారస్తులు పూర్త అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు రూరల్ సీఐ రవీంద్ర, ఎస్ఐ ఓబయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



## బీసీ బాలుర గురుకుల పాఠశాల ప్రధాన ఆచార్యులుగా సత్యనారాయణ

**సత్యవేడు, డిసెంబరు 31 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా సత్యవేడు జ్యోతిరావు పూలే బాలుర గురుకుల పాఠశాల ఇన్‌చార్జి ప్రధాన ఆచార్యులుగా సత్యనారాయణ బాధ్యతలు స్వీకరించారు. మంగళవారం స్థానిక బాలుర గురుకుల కార్యాయలంలో ఆయన బాధ్యతలు సేకరించడం జరిగింది. ఇక్కడ ప్రధాన ఆచార్యులుగా పని చేస్తున్న శ్రీనివాసులు ఉద్యోగ విరమణ చేసిన నేపథ్యంలో సత్యసాయి జిల్లా పేరూరు గురుకులంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న సత్యనారాయణను బదిలీపై ఇక్కడ ఇన్‌చార్జి ప్రధానోచార్యులుగా నియమితులయ్యారు. ఈ క్రమంలో సత్యనారాయణ సత్యవేడు జ్యోతిరావు పూలే గురుకుల ప్రధాన ఆచార్యులుగా బాధ్యతలు చేపట్టారు.

## తలియాకుల లక్ష్మయ్యకు గల్లా జయదేవ్ నివాళి



**చంద్రగిరి, డిశంబర్ 31 ప్రభాతవార్త:** టిటిడి విశ్రాంత ఉద్యోగి తలియాకుల లక్ష్మయ్యగారి చిత్రపటానికి మాజీ ఎంపి గల్లా జయదేవ్ పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. మాజీ మంత్రి గల్లా అరుణకుమారి అభిమాని, అత్యంత సన్నిహితుడు శ్రీనివాసమంగాపురంకు చెందిన తలియాకుల రాజగోపాల్ తండ్రి తలియాకుల లక్ష్మయ్యకు మంగళవారం శుభస్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. హాజరైన గల్లా జయదేవ్ ముందుగా లక్ష్మయ్య చిత్రపటం వద్ద నివాళులర్పించి, కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట బడి సుధాయాదవ్, తానికొండ కేశవులు, మస్తాన్, వున్నారు.

## యుటిఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

చంద్రగిరి, డిశంబర్ 31 ప్రభాతవార్త:



స్థానిక ఎంఆర్‌సి కార్యాలయం వద్ద మంగళవారం ఎంఈఓ శ్రీవరం లలితకుమారి, ఎంఈఓ-2 భాస్కర్‌బాబు, సర్వశిక్ష అభియాన్ ఏఎస్ఓ సారధి యుటిఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. యుటిఎఫ్ నాయకులు, కార్యకర్తలకు, ఉపాధ్యాయులకునూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## యుద్ధ ప్రాతిపదికన వితంతు పింఛను మంజూరు..

రేణిగుంట డిసెంబర్31ప్రభాతవార్త



ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు రేణిగుంట పాంచాలి నగర్ కు చెందిన రాజేంద్ర సతీమణి భాగ్యలక్ష్మి కి ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ ను అధికారులు యుద్ధ ప్రాతిపదికన మంజూరు చేసి మంగళవారం అందజేశారు. రేణిగుంట పాంచాలి నగర్ కు చెందిన రాజేంద్ర ఇటీవల మృతి చెందారు. ఆయన భార్య భాగ్యలక్ష్మి వితంతు పింఛనుకు అర్జీ పెట్టుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల్లో భాగంగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ప్రమేయంతో అధికారులు ఏ మాత్రం ఆలస్యం చేయకుండా పింఛన్ మంజూరు పనులను వేగవంతం చేశారు. మంజూరు అయిన పింఛను డబ్బులను అధికారులతో కలిసి రేణిగుంట పట్టణ టిడిపి అధ్యక్షుడు మహబూబ్ బాషా ఆమెకు అందజేశారు

## ఎమ్మెల్యే ఆదేశాలతో..పార్కులు శుభ్రం

రేణిగుంట డిసెంబర్ 31 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి ఎమ్మెల్యే ఆదేశాలతో రేణిగుంట గుంటకట్ట వాకింగ్ పాత్, గుంటకట్ట లోపల, బిస్మిల్లా నగర్ పార్కులను రేణిగుంట మేజర్ పంచాయతీ కార్యదర్శి మణి పారిశుద్ధ కార్మికులతో మంగళవారం శుభ్రం చేయించారు. ఆంగ్ల నూతన సంవత్సర సందర్భంగా పార్కుల్లో వేడుకలు జరుపుకోవడానికి పార్కులను శుభ్రం చేయించాల్సిందిగా ఆ ప్రాంతవాసులు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డికి విన్నవించారు. తక్షణం స్పందించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పంచాయతీ అధికారులను పార్కులను శుభ్రం చేయాల్సిందిగా ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు కార్యదర్శి మణి పారిశుద్ధ్య కార్మికులతో పార్కుల్లో మొలచిన పిచ్చి మొక్కలను, గుంటకట్ట వాకింగ్ పాత్ పై పేరుకుపోయిన చెత్తను తొలగించారు.

## ప్రజలు రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలి... తాహసిల్దార్

రేణిగుంట డిసెంబర్31ప్రభాతవార్త



ప్రజలు రెవెన్యూ సదస్సులను వినియోగించుకొని భూ సమస్యలను పరిష్కరించుకోవాలని రేణిగుంట తహసిల్దార్ సురేష్ బాబు అన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సు మంగళవారం రేణిగుంట మండలం అమ్మవారి పట్టెడ, అత్తూరు గ్రామాలలో జరిగాయి. ఇరు గ్రామాల్లో దాదాపు సదస్సుకు 60 మంది పాల్గొని పలు భూ సమస్యలను తాహసిల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. అత్తూరు నందు నాలుగు ఆర్ఓఆర్లు, రెండు సర్వేలు, జరుగగా అమ్మవారి పట్టెడ లో ఒక ఇనాం భూమి పరిష్కారం జరిగినట్లు తాహసిల్దార్ తెలిపారు

## పొద్దుపొడవక ముందే తలుపు తట్టి పెన్షన్లు

నాయకుల హంగామా!లబ్దిదారుల సంబరాలు



శ్రీకాళహస్తి,డిసెంబర్ 31 ప్రభాతవార్త అంగ్ల సంవత్సరాదికి ఒక్క రోజు ముందే సామాజిక పెన్షన్లను అందించాలని ప్రభు త్వం ఆదేశించింది. దీంతో మంగళవారం వేకువ జాము 5గంటలకే లబ్దిదా రుల తలుపులు తట్టి పెన్షన్లను అందించారు. మున్సిపల్ పరిధిలోని పలు చోట్ల శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ పెన్షన్లను పంపిణీ చేసారు. రాజకీయ నాయకులు చొరవ చూపటంతో ద్వితీయ శ్రేణి నాయకులు హాజరయ్యారు. దాంతో లబ్దిదారుల్లో సంబరాలు చోటు చేసుకున్నాయి. బృందమ్మ 16,33వార్డుల్లో పెన్షన్లు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమాల్లో పట్టణ తెలుగుదేశం అధ్యక్షుడు విజయకుమార్‌నాయుడు, మాజీ కౌన్సిలర్ బషీర్, ఆర్ముగం, వెంకటరమణ, వాకచర్ల గురప్పశెట్టి తదితరులు హాజరయ్యారు.

***8వేల మందికి పెన్షన్లు:*** శ్రీకాళహస్తి పట్టణంలో మంగళవారం వేకువ జాము నుంచి మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది ఆయా వార్డుల్లోని నాయకులతో కలసి పెన్షన్లను పంపిణి చేసినట్లు కమిషనర్ బియస్ గిరిబాబు వివరించారు. ఏ వార్డులో అయితే రెగ్యులర్‌గా పంపిణి చేసే ఉద్యోగి గైరుహాజరైతే ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసి అందించామని వివరించారు. ఆర్ఓ ఖాదర్‌మొహిద్దీన్, డిఇఇ సంజీవ్‌కుమార్, ఎఇఇ తేజస్వీని తదితరులు సహకరించారని కమిషనర్ బియస్‌గిరికుమార్ వివరించారు.

# తిరుపతి డివిజన్

## కూటమి ప్రభుత్వంలో ఇక అన్ని మంచిరోజులే

-చిగురువాడలో ఎన్టీఆర్ భరోసా పంపిణిలో ఎమ్మెల్యే పులివర్తి నాని

తిరుపతి,డిసెంబర్ 31 ప్రభాతవార్త:



ఒకటో తారీఖు వచ్చిందంటే అవ్వాతాతల మొఖాల్లో కనబడేఆనందం వెలకట్టలేనిదని, రాష్ట్రంలోని వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందజేసి, ఆ ఇంటి పెద్ద కొడుకులా సి.యం.చంద్రబాబునాయుడు ఆర్థిక భరోసా కల్పిస్తున్నాడని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. నెలబడే సరికే తక్షణమే ఆ నెల పింఛన్ అందుతుందని, కూటమి ప్రభుత్వంలో అందరికి మంచే జరుగుతుందన్నారు. మంగళవారం చిగురువాడ గ్రామ పంచాయతీలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఎమ్మెల్యే పులివర్తి నాని చేతుల మీదగా అందజేసారు. రాష్ట్రం ప్రభుత్వం అందించే రూ.4వేల రుపాయాలతో పాటు అదనంగా ఎమ్మెల్యే స్వంత నగదు మరో రూ.2వేల రుపాయాలు కలిపి లబ్దిదారులకు అందజేసారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పులివర్తి మాట్లాడుతూ ప్రతినెల 1వ తారీఖున పింఛన్ పంపిణి చేయాల్సి ఉందని, జనవరి ఫస్ట్ నూతన సంవత్సరం సెలవు కావడం వలన ఒకరోజు ముందుగనే పింఛన్ పంపిణి చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి తిరుపతిరూరల్ అధ్యక్షుడు ఎ.ఈశ్వర్‌రెడ్డి, చిగురువాడ సర్పంచ్ ముచ్చేలి ప్రదీప్‌కుమార్‌రెడ్డి, వార్తాల శ్రీనివాసులు, వార్తాల శివ యాదవ్, క్రిష్ణమూర్తిరెడ్డి, మురళి, కుమార్, అవిలాల సుధాకర్, నాగూరు శ్రీనివాసులు, దుర్గసముద్రం మునిశేఖర్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

## వాకర్స్ ఇంటర్నేషనల్ డైరెక్టరీ ఆవిష్కర

పుత్తూరు,డిసెంబరు31ప్రభాతవార్త:



పట్టణంలో మంగళవారం వాకర్స్ అసోసియేషన్ ఇంటర్నేషనల్ 2025 డైరక్టరీని వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్, ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు కోనేటి రవిరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ఉషోదయ వాకర్స్ అసిసియేషన్‌కు మెడికల్ క్యాంప్ అవార్డు, ఉత్తమ సర్వీస్ అవార్డు, బెస్ట్ అప్లికేషన్ అవార్డు తదితర పలు అవార్డులు లభించాయని తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు బాబు, కార్యదర్శి రామ్మోహన్ వర్మ, కోశాధికారి లోకనాథనాయుడు, సంయుక్త కార్యదర్శి రమేష్‌రాజు ఇంకా చంద్రబాబురాజు, రోహిత్ వర్మ, వెంకటేశ్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

తిరుపతి,డిసెంబర్ 31 ప్రభాతవార్త:



భూమికి సంబంధించిన సమస్యలను పరిష్కరించుటకు రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందని, సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి రూరల్ తహశీల్దార్ బి.రామాంజులునాయక్ కోరారు. మంగళవారం తిరుపతిరూరల్ కొత్తూరులో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఎఫ్ లైన్, మ్యుటేషన్ తదితర భూ సమస్యల అర్జీలు అందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నేతలు అలిమినేని మధు, మధుశేఖర్, చెర్లోపల్లి శ్రీధర్‌నాయుడు, మునికృష్ణారెడ్డి, ఆర్ఐ రఘువర్మ, విఆర్వో రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంక్షేమ సంఘ క్యాలెండర్ ఆవిష్కరణ

తిరుపతి,డిసెంబర్ 31 ప్రభాతవార్త:



ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంక్షేమ సంఘం క్యాలెండర్‌ను మంగళవారం బైరాగిపట్టెడలోని రెడ్డి సంఘం కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో వున్న అన్ని కులాల సంబంధించినటువంటి తల్లిదండ్రులు లేని పిల్లలకు ఉచిత విద్య వసతి సదుపాయం కల్పించటానికి ప్రవేట్ స్కూల్స్ యాజమాన్యం ముందుండి సహకారం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ దండు ధర్మారెడ్డి, ప్రవేట్ స్కూల్స్ యజమానులు రెడ్డివారి శ్రీధర్‌రెడ్డి, ఓంప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఘనంగా పదవీ విరమణ

పాకాల, డిసెంబర్ 31, ప్రభాతవార్త



పాకాల మండలంలోని స్థానిక యన్.వి.యన్. ఇంగ్లీష్ ప్రాథమిక పాఠశాల నందు పనిచేస్తున్న డి. బాల సుబ్రమణ్యం నాయుడు పదవీ విరమణ కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిలుగా పాకాల జడ్.పి.టి.సి. నంగా పద్మజా రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి ఎం ఈ ఓ బాబ్జి ముఖ్య అతిథులు కాగా బాల సుబ్రమణ్యం నాయుడు దాదాపు 34 సంవత్సరాలు పాకాల మండలంలో వివిధ పాఠశాలలో పని చేసిన వ్యక్తి అని ఎంతో మంది విద్యార్థులకు విద్యా బుద్ధులు నేర్పించి తన దగ్గర చదువుకున్న ఎంతో మంది విద్యార్థులు ఉన్నత పదవులు అలంకరించి ఉన్నారని పలువురు కొనియాడారు. డి.వరలక్ష్మి బాల సుబ్రహ్మణ్యం నాయుడు దంపతులులను ప్రధానోపాధ్యాయులు రఫి, మాజీ ఎం ఈ ఓ బాలాజీ నాయుడు వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించి సత్కరించారు. కార్యక్రమం బంధుమిత్రులు పాల్గొన్నారు.

## ఉమ్మడి టీడీపీ ప్రభుత్వంలో రోడ్లకు మహర్దశ..!

కేవీబీ పురం, డిసెంబరు 31 ప్రభాతవార్త:



ఉమ్మడి టీడీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు రోడ్లకు మహర్దశ కలిగిందని తిరుపతి పార్లమెంట్ యువత అధికార ప్రతినిధి అవసరం సురేష్‌రెడ్డి తెలిపారు. కేవీబీ పురం మండలంలో 36 సిమెంటు రోడ్లకు గాను రెండు కోట్లతో ముమ్మరంగా పనులు జరుగుతున్న నేపథ్యంలో పార్టీ నేతలతో అధికారులు కలసి సిద్ధమనాయుడు కండ్రిగలో జరుగుతున్న సిమెంటు రోడ్డు పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ప్రభుత్వంలో ప్రజలకు వివిధ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చడమే కాకుండా రోడ్లకు మహర్దశ ఏర్పడిందని ఇందులో భాగంగా ఒక్క కేవీబీ పురం మండలానికి సిమెంటు రోడ్లకు డ్రైనేజీకి ప్రభుత్వం రెండు కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. ప్రస్తుతం కేవీబీ పురం మండలంలో ముమ్మరంగా సిమెంటు రోడ్డు పనులు జరుగుతున్నాయని తెలిపారు. మాజీ సర్పంచ్‌లు గోవిందరాజులు, వెంకటేష్, నేతలు వెంకటేష్‌రెడ్డి, ఉమ్మడి పార్టీ నేతలు పీఆర్ఏఈ పవన్‌కుమార్, హౌసింగ్ ఏఈ దినేష్ తదితరులు ఉన్నారు.

## ఇరుగుళం హైస్కూలుని కళాశాల స్థాయికి పెంచండి - ఎంపీపీ

సత్యవేడు, డిసెంబరు 31 ప్రభాతవార్త:



సత్యవేడు మండలం ఇరుగుళం జడ్పీ ఉన్నత పాఠశాలను కళాశాల స్థాయికి పెంచాలని స్థానిక ఎంపీపీ ప్రతిమ విన్నవించారు. మంగళవారం చిత్తూరులో జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అధ్యక్షతన కలెక్టర్ పర్యవేక్షణలో జడ్పీ సమావేశం నిర్వహించారు. ఎంపీపీ ప్రతిమ సమస్యలను లేవనెత్తారు. ఇందులో భాగంగా సత్యవేడు పట్టణంలో బీసీ కాలనీ, ఎస్సీ కాలనీ, ఇరుగుళం తదితర ప్రాంతాల్లో అంగన్‌వాడీ నూతన భవనాలను మంజూరు చేయాలన్నారు. అలాగే రైతులు సంబంధించి వ్యవసాయ విద్యుత్ మోటార్ల కలెక్షన్‌లో ఉచితంగా మెయిన్ విద్యుత్ వైర్లను అందించాలన్నారు. భర్త చనిపోతే వెంటనే సామాజిక భద్రత పింఛన్ ప్రస్తుతం మంజూరవుతుంది తప్ప గత నాలుగు నెలలుగా పెండింగ్ బాధితులకు కూడా పింఛన్ మంజూరు చేయాలని ఆమె విన్నవించారు. దీనిపై జిల్లా జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు సానుకూలంగా స్పందించినట్టు ఈ సందర్భంగా ఎంపీపీ తెలిపారు.

# గూడూరు డివిజన్

## క్రికెట్ పోటీలలో గెలుపొందిన జట్లు



గూడూరు, డిసెంబర్ 31 ప్రభాతవార్త : క్రికెట్ పోటీలలో చిల్లకూరు శేషమ్మ హై స్కూల్, ఆది శంకర స్కూల్, విందూరు జడ్పీ హైస్కూల్ జట్లు గెలుపొందింది. నిర్ణీత 10 ఓవర్లలో 62 పరుగులు చేసింది. అనంతరం 63 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ చేసిన సిఎస్ఎం జట్టు నిర్మిత 10 ఓవర్లలో విజయం సాధించింది. ఈ జట్టులోని చైతన్య 20 పరుగులు చేశారు. రెండవ మ్యాచ్లో విందూరు జడ్పీ హైస్కూల్ జట్టు, చెన్నూరు జడ్పీ హైస్కూల్ జట్టు తలపడ్డాయి బ్యాటింగ్ చేపట్టిన విందూరు జడ్పీ హైస్కూల్ జట్టు 10 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 92 పరుగులు చేసింది. అనంతరం 93 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన జడ్పీ హైస్కూల్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి కేవలం 82 పరుగులు మాత్రమే చేయగలిగింది. అనంతరం జరిగిన మూడో మ్యాచ్లో ఆదిశంకర స్కూల్ జట్టు, మినర్వా స్కూల్ జట్లు తలపడ్డాయి. బ్యాటింగ్ చేపట్టిన ఆదిశంకరాజట్టు నిర్ణీత 10 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 65 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన మినర్వా స్కూల్ జట్టు అజ్ఞాత పది ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 26 పరుగులు మాత్రమే చేసి పరాజయం పాలైంది. ఈ మ్యాచ్లను రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, జి జి నాయుడు, క్రికెట్ కోచ్ లవ్ కుమార్, మహేష్ తదితరులు నిర్వహించిన రోటరీ క్లబ్, గూడూరు క్రికెట్ క్లబ్, అల్లూరి ఆదిశేషారెడ్డి క్రికెట్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో నిర్వహిస్తున్న అంతర్ పాఠశాలల క్రికెట్ పోటీలలో రెండవ రోజు జరిగిన క్రికెట్ పోటీలలో చిల్లకూరు శేషమ్మ హై స్కూల్ ఆది శంకర స్కూల్, విందూరు జడ్పీ హైస్కూల్ జట్లు గెలుపొందాయి. మంగళవారం జరిగిన మూడు మ్యాచ్ లలో మొదటి మ్యాచ్లో జీవీఎస్ జట్టు టాస్ గెలిచింది.

## ఎమ్మెల్యేచే వార్త దినపత్రిక 2025 క్యాలెండర్ ఆవిష్కరణ



గూడూరు, డిసెంబర్ 31 ప్రభాతవార్త : గూడూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గూడూరు శాసనసభ్యులు డా. పాశంసునీల్ కుమార్ చేతుల మీదగా వార్త 2025 సంవత్సర నూతన క్యాలెండర్ ఆవిష్కరణ ఘనంగా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ వార్త పత్రికలో వచ్చే వార్తలు నిజాయితీగా కచ్చితంగా ఉంటాయని వారు తెలిపారు. గత 27 సంవత్సరముల నుండి వార్త పత్రిక పాఠకులు ముగ్దులైయ్యారని అన్నారు. ప్రజల నుండి వార్త పత్రికకు విశేష స్పందన నేటికీ ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు గణపతి, కిషోర్ నాయుడు, కొండూరు వెంకటేశ్వర్లు రాజు, పులిమి శ్రీనివాసులు, పూడిపర్తి ప్రవీణ్ కుమార్‌రెడ్డి, మేఘనూరు వెంకట కృష్ణయ్య, కోట సతీష్. భాస్కర్‌రెడ్డి, సర్పూర్ నాగేశ్వరావు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు ఇంగ్లీష్‌ను దూరం చేసే కుట్ర

కోట, డిసెంబర్ 31 ప్రభాతవార్త : అందరూ సమానంగా ఎదగాలి. ఆంధ్ర రాష్ట్రం ప్రపంచ దేశాలతో పోటీపడాలన్న దృఢ సంకల్పంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంగ్లీష్ మీడియం తీసుకొస్తే, తెలుగు మహాసభల పేరుతో ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం లేకుండా చేయాలని కూటమి ప్రభుత్వం కుట్రలకు పాల్పడుతున్నదని వైసీపీ తిరుపతి జిల్లా యువజన విభాగం కార్యదర్శి నేదురుమల్లి హరిశ్చంద్రారెడ్డి ఆరోపించారు. మంగళవారం ఆయన కోటలో విలేఖరులతో మాట్లాడుతూ ప్రస్తుతం పోటీ ప్రపంచంలో ఇంగ్లీష్ రాకపోతే మనుగడే లేదని జగన్‌మోహన్‌రెడ్డి ముందుచూపుతో ప్రాథమిక స్థాయి నుంచి ఇంగ్లీష్ మీడియం తెచ్చారన్నారు. ప్రభుత్వానికి తెలుగు భాషపై నిజంగా ప్రేమ ఉంటే ప్రతి గ్రామం, పట్టణంలో ఒక చోట తెలుగు, ఇంగ్లీష్ మీడియం స్కూళ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఎవరికి ఏ మీడియం కావాలంటే ఆ మీడియంలో చేరుతారన్నారు. కార్పొరేట్ విద్యను ప్రోత్సహించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమాన్ని రద్దుచేసి పేద విద్యార్థులకు అన్యాయం చేయవద్దని హితవు పలికారు.

## కొత్త సంవత్సరం వేళ.. ధరలు కొక్కొరోకో

కోట, డిసెంబర్ 31 ప్రభాతవార్త : మొన్నటి వరకు కార్తీక మాసం. అయ్యప్ప మాలధారణ దీక్షలతో కోడిమాంసం ధరలు తగ్గుముఖం పట్టాయి. ఇటీవల క్రిస్మస్ వేడుకలు జరిగాయి. నూతన సంవత్సర సంబరాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మళ్లీ కోడి మాంసం ధరలకు రెక్కలొచ్చాయి. సెలవులు,సాధారణ శుభకార్యాలతో బాయిలర్ మాంసం వినియోగం పెరిగింది. బాయిలర్ స్కిన్ కేజీ రూ.200, స్కిన్‌లెస్ అయితే రూ.220 చొప్పున విక్రయిస్తున్నారు. ఈ వారం ధరలు వరుసగా రూ.220 నుంచి 240కి చేరాయి. త్వరలోనే సంక్రాంతి వస్తుండటంతో ధరలు ఎగబాకను న్నాయి.

## 96 శాతం ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ

కోట, డిసెంబర్ 31 ప్రభాతవార్త : ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లు కోట మండలంలో మంగళవారం ఉదయం 5.30 గంటల నుంచే పంపిణీ చేశారు. ముందుగా కేశవరం గ్రామంలో ఎంపిడిఓ వేణు చేతులు మీదుగా అవ్వాతాతలకు పింఛన్లు అందజేశారు. మండలంలో 96 శాతం పింఛన్లు పంపిణీ పూర్తయినట్లు తెలిపారు. మరో రెండురోజుల్లో మిగతా వారికి పింఛన్లు పంపిణీ చేస్తామన్నారు. కోట మండలంలో ఏడు వేల మందికి గాను 2 కోట్ల 93 లక్షల రూపాయలు పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉందన్నారు.

## తడ మండల బిజెపి అధ్యక్షునిగా తేజ



తడ, డిసెంబర్ 31 ప్రభాతవార్త : తడ మండలం భారతీయ జనతా పార్టీ అధ్యక్షునిగా కాసింఖాన్‌కండ్రిగకు చెందిన చిల్లకూరు తేజారెడ్డిని ఎన్నుకున్నారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాకాటి నారాయణరెడ్డి ఆదేశాలతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ ఎన్నిక ఏకగ్రీవంగా నిర్వహించారు. పార్టీ నియోజకవర్గం నాయకులు ఆరణి విజయభాస్కర్‌రెడ్డి, తాటిపర్తి ఆదినారాయణరెడ్డి, రాచర్ల కృష్ణమూర్తి, గోపి ఆచారి తదితరులు ఈ ఎంపికలో పాల్గొన్నారు. గ్రద్దగుంట పంచాయతీ కాసిం ఖాన్‌కండ్రిగ గ్రామానికి చెందిన తేజారెడ్డి తండ్రి చిల్లకూరు శ్రీనివాసులురెడ్డి గతంలో తడ మండల పరిషత్ ఉపాధ్యక్షునిగా పనిచేసి ఉన్నారు. తనపై నమ్మకం ఉంచి అధ్యక్షునిగా ఎంపిక చేసిన నాయకులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తేజారెడ్డి పేర్కొన్నారు.

## మండలంలో జోరుగా పింఛన్లు పంపిణీ

తడ, డిసెంబర్ 31 ప్రభాతవార్త : నూతన సంవత్సరానికి ముందు రోజే రాష్ట్రప్రభుత్వం ఆదేశాల మేరకు పింఛన్లు పంపిణీ చేశారు. తడ మండలంలో ఆయా గ్రామాల సచివాలయ సిబ్బంది ఈ పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎంపిడిఓ విజయకుమార్ పలు గ్రామాలకు వెళ్లి సిబ్బందిని ఉదయం పూటే పింఛన్లు పంపిణీ చేసే విధంగా చర్యలు చేపట్టారు. తడ మండలంలో మొత్తం 5,919 మందికి పింఛన్లు అందజేయాల్సి ఉంది.

## కోట భాజపా అధ్యక్షులగా వాసు ఎకగ్రీవం



కోట,డిసెంబర్ 31 ప్రభాతవార్త : కోటలోని మంగళవారం కోట మండల భాజపా అధ్యక్షులగా వాసు ను ఎకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఆమేరకు ఈ ఎన్నికల నిర్వహణ కు పార్టీ అతిరధ మహరధులు హజరైయ్యారు. పార్టీ సినియర్ నాయకుడు పాపారెడ్డి పురోషత్తమ్ రెడ్డి, రాష్ట్ర భాజపా కార్యవర్గ సభ్యులు పనబాక కోటీశ్వరరావు, నియెజవర్గ నాయకులు పాదర్తి కోటారెడ్డి, పామంజి కృష్ణయ్య, డా.రమేష్‌బాబు లు విచ్చేశారు.వాకాడు మండల భాజపా అధ్యక్షులగా చంద్రారెడ్డిని ఎన్నుకొన్నారు.ఈ కార్యక్రమంలో ఆవుల నారాయణ రావు, వెంకటేశ్వర్లు , సుబ్బారావు,తదితరులు పాల్గొన్నారు.

## వేడుకలు శాంతియుతంగా జరుపుకొండి



దొరవారిసత్రం, డిసంబర్ 31 ప్రభాతవార్త : మండల ప్రజలందురూ నూతన సంవత్సర వేడుకలను శాంతియుత వాతావరణంలో జరుపు కోవాలని ఎస్.ఐ. అజయ్ కుమార్ కోరారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు మండల పరిధిలో జరగకుండా ప్రజలు జాగర్తలు తీసుకోవాలని సూచించారు. డిసంబర్ 31 రాత్రి 7 గంటల నుండి ప్రత్యేక డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిక్వహించ బడతాయని తెలిపారు. మద్యం సేవించి గ్రామాలలో,రోడ్లపై వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదుచేసి కోర్టులో హాజరు పరుస్తామన్నారు. అనంతరం వాహనాలు సీజ్ చేసి,లైసెన్స్ రద్దు వంటి చర్యలు తీసుకుంటామని నిబందనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని తెలియజేశారు.

## ఎన్‌బీకేఆర్ ఐఎస్‌టిలో ప్రాంగణల ఎంపికలు



కోట,డిసెంబర్ 31 ప్రభాతవార్త : కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెర్ ఐఎస్‌టిలో మంగళవారం బెంగూళూరుకు చెందిన టాట్ ఎఫ్‌డి టెక్నాలిజీ సంస్థ ప్రాంగణ ఎంపికలను నిర్వహించింది. ఈఎంపికలకు ఆఖరి సంవత్సరం చదువవతున్న విద్యార్థులు హాజరైయ్యారు. 256 మంది విద్యార్థులకు ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించారు. ఈ ఎంపికల నిర్వహాణకు కంపినీ సిఇఓ ఎన్‌బీకేర్ పూర్వ విద్యార్థియిన రమేష్, హెచ్‌ఆర్ సందాని విచ్చేశారు.ఈ సందర్భంగా ప్రాంగణ ఎంపికలకు కారకులైన పూర్వ విద్యార్థి రమేష్‌ను ప్రత్యేకంగా డైరెక్టర్, వి.విజయకుమార్‌రెడ్డి అభినిదించారు.256మంది విద్యార్థులు కోడింగ్‌కు 46 మంది విద్యార్థులు అర్హత సాధించారు. ఎంపికైన విద్యార్థులకు వార్షిక వేతనం రూ 3.8 లక్షల నుంచి 4.6 లక్షలు ఇవ్వనున్నట్లు ప్రాంగణ ఎంపిక అధికారి డా.ఎన్.కిషందర్ తెలిపారు.

## ప్రశాంతంగా వేడుకలు జరుపుకోవాలి



ఓజిలి, డిసెంబర్ 31 ప్రభాతవార్త : డిసెంబర్ 31వ తేదీన న్యూ ఇయర్ వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, రాత్రి ఒంటి గంట తర్వాత రోడ్లపై తిరగరాదనే నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఓజిలి ఎస్ఐ స్వప్న హెచ్చరించారు. సోమవారం ఓజిలి పోలీస్ స్టేషన్‌లో ఆమె మాట్లాడుతూ డిసెంబర్ 31వ తేదీ రాత్రి టపాసులు పేల్చడం బహిరంగ ప్రదేశాల్లో కేకులు కట్ చేయడం, సైలెన్సర్లు తీసి వాహనాలు నడపడం వంటివి చేయరాదని ఆమె సూచించారు. అలా చేస్తే వాహనాలు సీజ్ చేయడం జరుగుతుందన్నారు. అవసరమైతే రౌడీషీట్లు ఓపెన్ చేస్తామని కోడిపందాల్లో ప్రజలు ఎవరూ పాల్గొనకూడదని హెచ్చరించారు.

## టెక్నాలజీలో కోడ్నెస్ట్ డ్రైవ్ విజయవంతం



గూడూరు, డిసెంబర్ 31 ప్రభాతవార్త : గూడూరు ఆదిశంకర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రాంగణంలో కోడ్నెస్ట్ సంస్థ 2025 బ్యాచ్ విద్యార్థుల కోసం ప్రత్యేక నియామక డ్రైవ్‌ను నిర్వహించింది. ఈ డ్రైవ్ ట్రైన్ అండ్ హైర్ కార్యక్రమం కింద జరిగింది. విద్యార్థులకు ప్రత్యేక శిక్షణతో పాటు 30 లక్షల వరకు ప్యాకేజీతో ఉన్న ఉద్యోగ అవకాశాలను కల్పించడం దీని ముఖ్య ఉద్దేశం. ఈ కార్యక్రమంలో కోడ్నెస్ట్ సీఈఓ ప్రభాకరం, కాలేజీ చైర్మన్ వంకి పెంచలయ్య, వైస్ చైర్మన్ వంకి అనుష, ప్రిన్సిపాల్ డాక్టర్ వెను మాధవ్, ప్లేస్మెంట్ ఆఫీసర్ ఆర్చన, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రామయ్య పాల్గొన్నారు. ఈ నియామక ప్రక్రియలో గ్రూప్ డిస్కషన్, టెక్నికల్ ఇంటర్వ్యూ అనే రెండు దశలు నిర్వహించారు. మొత్తం 27 మంది విద్యార్థులు ఈ ఎంపిక దశలను విజయవంతంగా పూర్తి చేసి కోడ్నెస్ట్ సంస్థలో ఉద్యోగ అవకాశాలను పొందారు. ఈ డ్రైవ్ విద్యార్థులకు శిక్షణతో పాటు ప్రతిష్టాత్మక ఉద్యోగ అవకాశాలను అందించడంలో కీలక పాత్ర పోషించింది.

## సోషలిజంతోనే సమాజాభివృద్ధి

**- దేశ సమగ్రత, సమైక్యత, సమానత్వం కోసం సమరశీల పోరాటాలు - సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సీహెచ్. ప్రభాకర్ వెల్లడి - రెట్టపల్లి గ్రామంలో ఘనంగా సీపీఐ శతాబ్ది ఉత్సవాలు**



చిల్లకూరు, డిసెంబర్ 31 ప్రభాతవార్త : సోషలిజంతోనే సమాజంలో అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యపడుతుందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సీహెచ్. ప్రభాకర్ అన్నారు. మంగళవారం చిల్లకూరు మండలంలోని రెట్టపల్లి గ్రామంలో సీపీఐ పార్టీ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా పార్టీ జెండాని సిపిఐ గూడూరు నియోజకవర్గ కార్యదర్శి జి. శశి కుమార్ ఎగురవేశారు. ప్రభాకర్, శశి కుమార్ మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26న ఉత్తర ప్రదేశ్‌లోని కాన్పూర్ నగరంలో సీపీఐ ఆవిర్భవించిందన్నారు. దేశ సమైక్యత, సమగ్రత కోసం సమరశీల పోరాటాలు నిర్వహిస్తూ, దేశ స్వాతంత్ర్యం కోసం మీరట్, పెషావర్ కుట్ర కేసులను ఎదుర్కొని బ్రిటిష్ పాలకుల నుంచి దేశాన్ని విముక్తి చేయడంలో సీపీఐ అగ్ర భాగాన నిలిచిందన్నారు. ఈ దేశంలో సంపూర్ణ స్వాతంత్ర్యం, దున్నే వాడికే భూమి, 8 గంటల పని విధానం, భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు చేయాలని పోరాడింది కమ్యూనిస్టులేనని గుర్తు చేశారు. గూడూరు పట్టణ కార్యదర్శి షేక్ కాలేషా, చిల్లకూరు మండల కార్యదర్శి గుండాల రమేష్, డీహెచ్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎంబేటి చంద్రయ్య, బీకేఎంయూ నియోజకవర్గ కార్యదర్శి ఎన్. శ్రీనివాసమూర్తి, ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి యశ్వంత్, బాలాజీ సీపీఐ నాయకులు సీతా భాస్కర్, తులసి, రఘురామయ్య,ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు వెంకటయ్య,పార్టీనాయకులుకార్యకర్తలు,నాయకులుతదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేచే సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

గూడూరు, డిసెంబర్ 31 ప్రభాతవార్త : చిల్లకూరు మండలం కడివేడు గ్రామం కు చెందిన దర్శిగుంట రమణయ్య కు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరు అయిన 69,947 రూపాయుల చెక్కును క్యాంప్ కార్యాలయం నందు ఎమ్మెల్యే డా. పాశం సునీల్ కుమార్ అందించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు భాస్కర్ రెడ్డి నాగేశ్వరావు నాయుడు, తిరుపతి ప్రవీణ్ కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే



గూడూరు, డిసెంబర్ 31 ప్రభాతవార్త : పేద ప్రజల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని నాలుగో వార్డులో ఎమ్మెల్యే పెన్షన్లను లబ్ధిదారులకు అందజేశారు. పలు సమస్యలు స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం వచ్చిన వెంటనే పెన్షన్లను పెంచడం జరిగిందని దీంతో పేద ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చేవారు శాలువాలు బొకేలు తీసుకురావద్దని నోట్ బుక్స్, పెన్నులు తీసుకువస్తే పేద విద్యార్థులకు అందిస్తామని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, నాయకులు బిల్లు చెంచు రామయ్య చంద్రమోళి, నరసింహులు నాయుడు, శ్రీధర్, రహీం, మోహన్, అల్లి భాష, తదితరులు పాల్గొన్నారు.

## పలు ఆలయాల క్యాలెండర్ ఆవిష్కరణ

గూడూరు, డిసెంబర్ 31 ప్రభాతవార్త : గూడూరు పట్టణంలోని



తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం శాసనసభ్యులు పాశం సునీల్ కుమార్ చిల్లకూరు మండలంలోని తూర్పు కనుపూరు ముత్యాలమ్మ అమ్మవారి క్యాలెండరు,తమ్మిన పట్నం గ్రామంలో ఉన్న శ్రీ కోదండరామ స్వామి దేవస్థానం ఆలయ నూతన క్యాలెండర్, చిట్టమూరు మండలం మల్లం గ్రామంలోని ఉన్న సుబ్రహ్మణ్య స్వామి వారి ఆలయ నూతన కేలండర్‌లను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో టిడిపి పార్టీ అధికారంలోకి రావడం సంతోషదాయకమన్నారు. అదే విధంగా ఇటీవల 108 సిబ్బందికి జీతాల విషయంలో అవతల జరిగాయని అదే విధంగా సరైన జీతం లేక ఇబ్బందులకు గురి అవుతున్నారు అన్న విషయాన్ని తెలుసుకొని 4000 రూపాయలు జీతం పెంచడం అబినందనీయమన్నారు. 108 సిబ్బంది ఎమ్మెల్యేని ఘనంగా శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో గణపతి, కిషోర్ నాయుడు, కొండూరు వెంకటేశ్వరరాజు, పులిమి శ్రీనివాసులు, యదనపర్తి భాస్కర్‌రెడ్డి, కుడిపత్తి ప్రవీణ్ కుమార్‌రెడ్డి, కోట సతీష్ రాఘవ, వెంకట కృష్ణయ్య, ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ బాబు, ఈవోలు నవీన్ కుమార్, రవి కృష్ణ, సుశాంక్ తదితరులు పాల్గొన్నారు.

## ముందు రోజే పెన్షన్లు పంపిణీ : ఎమ్మెల్యే



వెంకటగిరి, డిసెంబర్ 31 ప్రభాతవార్త : నూతన సంవత్సరంలో పేదలు సంతోషంగా ఉండాలని ముందు రోజే పెన్షన్లు పంపిణీ చేయి ంచారని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. మండలంలోని పారువాలు గిరిజన వాడలో ఆయన పెన్షన్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలు అన్నిటిని నెరవేరుస్తున్నట్లు చెప్పారు.పేదల సంక్షేమ ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తనుజ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు చంద్రమోళి రెడ్డి, సీఐ ఏవి రమణ తదితరులు పాల్గొన్నారు.

## ముందుగానే పెన్షన్లు పంపిణీ

బాలాయపల్లి, డిసెంబర్ 31 ప్రభాతవార్త : 2025 జనవరి నెల నూతన సంవత్సరం దృష్ట్యా ఒక రోజు ముందుగానే ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లు పంపిణీ చేశామని ఎంపీడీవో వినీల్ కుమార్ తెలిపారు. ఉదయం నుంచే పెన్షన్ దారుల ఇళ్లవద్దకు వెళ్లి సచివాలయం సిబ్బంది పెన్షన్లు అందజేశారు. వృద్దులు, వితంతువులు, వికలాంగులకు మొత్తం 5240 మందికి రూ. 2కోట్ల 26లక్షల 59వేలు పెన్షన్లు పంపిణీ చేసాము. నూతన సంవత్సరంలో అందరూ సంతోషంగా ఉండాలని పెన్షన్లు పంపిణీ చేసామన్నారు.

## అంగన్వాడి పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

వెంకటగిరి, డిసెంబర్ 31 ప్రభాతవార్త : వెంకటగిరి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో 2 అంగన్వాడి కార్యకర్తలు, 11 అంగన్వాడి సహాయకురాల పోస్టులకు 2025జనవరి 6వ తేదీలోగా అర్హులైన వారు ఐసీడీఎస్ వెంకటగిరి ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సిడిపిఓ శంషాద్ బేగం తెలిపారు. కనీస అర్హత పదవ తరగతి ఉండాలని ఆమె సూచించారు. 21 నుంచి 35 సంవత్సరాలు వయసు కలిగిన, వివాహిత స్థానిక మహిళలు అర్హులని తెలిపారు.

## భూ సమస్యలకు పరిష్కారం: తహశీల్దార్



వాకాడు, డిసెంబర్ 31 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యలకు పరిష్కారం చేసుకోవాలని రెవెన్యూ సదస్సు కార్యక్రమా న్ని ప్రవేశపెట్టారని తాసిల్దార్ రామయ్య అన్నారు. మంగళవారం వాకాడు మండలం నెల్లిపూడి సచివాలయం పరిధిలోని సర్పంచ్ బందిల పోలమ్మ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ నెల్లిపూడి పంచాయతీ పరిధిలోని ఉన్నటువంటి రెవిన్యూ గ్రామాలలో భూ సమస్యల మీద వచ్చినటువంటి అర్జీలకు పరిష్కరించబడతాయని తహశీల్దార్ రామ య్య అన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ శకుంతల, వీఆర్వో అరుణ, వివిధ శాఖల సిబ్బంది, నాయకులు బందెల వెంకటయ్య, టిడిపి సీనియర్ నాయకులు కుంభాల రమణయ్య, హరీష్ నాయుడు, మొద్దు కోటయ్య, పోలయ్య, రమేష్ బాబు, నాయకులు, తదితరులు ఉన్నారు.

## శ్రీకాళహస్తీశ్వరుని హరితాభివృద్ధికి రక్షణ కరువు

**-రాత్రికి రాత్రి శ్రీగంధం చెట్టు మాయం**



శ్రీకాళహస్తి,డిసెంబర్ 31 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరుని హరితాభివృద్ధికి రక్షణ కరువైంది. సోమవారం రాత్రి భరద్వాజ తీర్థానిక పక్కనే గల సుమారు 10సంవత్సరాల శ్రీగంధం చెట్టును చిన్న రంపంతో కోసుకొని తీసుకెళ్ళారు. ఈఅంశం పట్టణంలో చర్చనీ యాంశంగా మారింది. కైలాసగిరుల్లో టేకు, శ్రీగంధం రక రకాల చెట్లతో పాటు వాటి పరిరక్షణకు హరితాభివృద్ధి పథకం అని పేరు పెట్టి సిబ్బందిని ప్రత్యేకంగా నియమించారు. కాలక్రమేణ పథకం కాలం పూర్తి కావటంతో హరితాభివృద్ధి పథకం రద్దు అయ్యింది. అక్కడ పని చేసే సిబ్బంది తమ పలుకుబడిని ఉపయోగించి శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్థిర పడ్డారు. దాంతో హరితాభివృద్ధిలో పచ్చని చెట్లకు రక్షణ కరువైంది. గత కొంత కాలంగా ఎవరికి ఇష్టమొచ్చినట్లు వారు చెట్లను నరుక్కుంటూ తీసుకెళుతున్నారు.బయట పడినపుడు దొంగతనం లేకుంటే దొరతనంలా చెట్టు మాయమౌతున్నాయి. సోమవారం రాత్రి కోనేరుకు పక్కనే ఉన్న శ్రీగంధం చెట్టును కోసుకుపోయారు.

**సెక్యూరిటి ఏమైంది? పోలీసుల గస్తీ ఎక్కడ?**

హరితాభివృద్ధి పథకం పరిరక్షణకు లోబావిలో రక్షణకు ప్రత్యేకంగా సెక్యూరిటి సిబ్బందిని నియమించారు. అయితే కైలాసగిరుల్లో విలువైన వృక్ష సంపద మాయమౌతుంటే అక్కడ ఉన్న సెక్యూరిటి ఏమైనట్లు ఏం చేస్తున్నట్లు అనేది ప్రశ్నార్థంగా మారింది. ఎక్కడో అడవిలో అయితే సరే కానీ సెక్యూరిటి కునుకుతీసే సమీపంలోనే చెట్టు కోసుకొని వెళితే అక్కడ సెక్యూరిటి లేదా? లేక ఆయన కూడా సహాకరించారా? అనేది చర్చనీయాంశంగా మారింది.ఇక నిత్యం రాత్రి గస్తీ తిరుగుతున్న పోలీసులు ఏమయ్యారు? పోలీసులు ఇక్కడ గస్తీ తిరుగుతున్నారా? లేదా? అనేది పట్టణంలో చర్చనీయాంశంగామారింది.

## పింఛన్ దారుల ఆరోగ్య భద్రతే ప్రభుత్వ ధ్యేయం



వడమాలపేట, డిసెంబరు 31 ప్రభాతవార్త: వృద్ధులు, వితంతవులు, వికలాంగుల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా నెలనెలా పింఛన్లు పంపిణీ చేసి అదుకోవడమే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వరులు తెలిపారు. మంగళవారం అప్పలాయగుంటలో పోలియో వ్యాధిగ్రస్తుడు మునిరత్నంకు 15 వేలు పింఛన్ నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌తో కలసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన పింఛన్ దారుల శ్రేయస్సు కోసం ప్రభుత్వం ముందస్తుగానే పింఛన్లు అందిస్తున్నట్లు తెలిపారు. కాగా నగరి ఎమ్మెల్యే మండలంలో కల్లూరు, జీహెచ్ పురంలలో పింఛన్లు అర్హులకు అందజేశారు. టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## పదవి విరమణ పొందిన అధికారులకు ఆత్మీయ వీడ్కోలు



తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 31 ప్రభాతవార్త: పదవి విరమణ పొందిన పోలీసు అధికారులు శేష జీవితం మంచి ఆరోగ్యంతో ఆనందంగా గడపాలని జిల్లా ఎస్పి సుబ్బరాయుడు తెలిపారు. మంగళవారం డిసెంబర్ నెలలో పదవీ విరమణ పొందిన ఏడుగురు పోలీసు అధికారులు, సిబ్బందిని స్థానిక పోలీస్ అతిథి గృహం కాన్ఫరెన్స్ హాల్ నందు వారి కుటుంబ సభ్యులు, ఆత్మీయుల సమక్షంలో జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేసి, ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మీరు క్రియాశీల సేవ నుండి పదవీ విరమణ చేస్తున్నారు, పోలీస్ శాఖ లక్ష్యం పట్ల ఇన్ని రోజులు మీ అంకితభావం, కృషి మరియు అచంచలమైన నిబద్ధతకు నేను మీకు నా ప్రగాఢ కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు. కానీ మీరు మీ జీవితంలోని ఈ కొత్త అధ్యాయాన్ని ప్రారంభించడాన్ని కూడా సంతోషిస్తున్నామని చెప్పారు. పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులు మాట్లాడుతూ మమ్మల్ని ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలకడం, సత్కరించడం మా జీవితంలో ఎన్నటికీ మరువలేమని జిల్లా ఎస్పీకి ధన్యవాదాలు తెలిపారు. అదనపు ఎస్పీలు వెంకట్రావు పరిపాలన, శ్రీనివాసరావు సాయుధదళం,పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులు కుటుంబ సభ్యులు,అధికారుల సంఘం అధ్యక్షులు సోమశేఖర్‌రెడ్డి, సెక్రటరీ శంకర్‌రెడ్డి, సభ్యులు హాజరయ్యారు.



వార్త జాతీయ తెలుగు దినపత్రిక 2025 క్యాలండర్‌ను ఎమ్మెల్యే మాతృమూర్తి బొజ్జల బృందమ్మ, శ్రీకాళహస్తీశ్వరాలయ ఇఓ బాపిరెడ్డి, మునిసిపల్ కమిషనర్ బి.ఎస్.గిరికుమార్‌చే మంగళశారం ఆవిష్కరించారు. -ప్రభాతవార్త శ్రీకాళహస్తి

